
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 15 జూన్ 2025



ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవుతుండటం..

ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవుతుండటం.. మరో వైపు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలంటూ ఇటు అధికార.. అటు ప్రతిపక్ష పార్టీల నేతలు పిలుపునిస్తుండటంతో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికల సందడి జరగబోతోందని స్పష్టమవుతోంది. ఈ ఎన్నికలను ఎదుర్కోవడం పార్టీలకు సవాల్‌గా మారనుండగా.. అధికార పార్టీకి మరింత ప్రతిష్ఠాత్మకం కానుంది. అయితే ఎన్నికల కోడ్ ఎప్పుడైనా అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున ఈలోపే ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రాజీవ్‌యువవికాసం లాంటి కీలక పథకాలు, ఇతర అభివృద్ధి పనుల ప్రక్రియను వేగవంతం చేయడంపై మంత్రులు, ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. నియోజకవర్గాల్లో అధికారులతో సమీక్షలు నిర్వహిస్తుండటంతో పాటు తమ పార్టీకి విజయం చేకూర్చేలా నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు.



పార్టీలకు స్థానిక పరీక్ష

- కోడ్ భయంతో వేగంగా అభివృద్ధి పనుల నిర్వహణ
- నియోజకవర్గాల్లో అధికారులతో మంత్రులు, ఎమ్మెల్యేల సమీక్షలు
- నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా సమావేశాలు

ఖమ్మం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రాజకీయపక్షాలకు ఈ ఎన్నికలు సవాల్‌గా మారనున్నాయి. ముఖ్యంగా అధికార పార్టీకి ప్రతిష్ఠాత్మకం కానున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున ఈలోగానే ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రాజీవ్ యువ వికాసం లాంటి పథకాల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియతో పాటు ఇతర అభివృద్ధి పనుల్లో వేగం పెంచేలా అధికారులను సిద్ధం చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ వారికి కీలక సూచనలు చేస్తున్నారు. ఇక పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికలకు సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో స్థానికంగా పార్టీ నాయకుల మధ్య ఉన్న సమన్వయం గురించి ఆరా తీయడంతో పాటు విబేధాలు ఉన్న చోట వాటిని చక్కదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పటికే కార్యకర్తలతో తుమ్మల సమావేశాలు..

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పలు చోట్ల కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్న ఇటీవల తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండల ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయని, వాటికి అందరూ సిద్ధం కావాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, విబేధాలకు అవకాశం ఇవ్వొద్దని హితబోధ చేశారు. అలాగే ప్రభుత్వం చేసిన, చేస్తున్న అభివృద్ధిపనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అలాగే ఆరుగ్యారంటీలు, రుణమాఫీ, రైతుభరోసాతో పాటు కొత్తగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రాజీవ్ యువ వికాసం లాంటి సంక్షేమ కార్యక్రమాలపై కూడా ప్రచారం నిర్వహించాలన్నారు. గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితా సిద్ధంచేయాలని కోరారు.

నేడు పాలేరు నియోజకవర్గంలో పొంగులేటి పర్యటన

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ఆదివారం పాలేరు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో పాలేరులోని తన క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్, ఏదులాపురం మునిసిపాలిటీకి చెందిన ముఖ్యనాయకులు, కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశాలు (మిగతా 2వ పేజీలో)

పర్యటనకు సిద్ధమవుతున్న డిప్యూటీ సీఎం

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా తన నియోజకవర్గ పర్యటనకు సిద్ధమవుతున్నారు. మండలస్థాయిలో కార్యకర్తలతో మమేకమవుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు వారిని సన్నద్ధంసేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై చర్చించి.. పార్టీకి విజయం చేకూర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే కోడ్ వచ్చేలోపు స్థానికంగా చేపట్టాల్సిన పనులు మంజూరుచేయడం, చేసిన పనులు ప్రారంభించడం లాంటి కార్యక్రమాలపై దృష్టి పెడుతున్నారు.



డిప్యూటీ సీఎం, మంత్రులను కలిసిన కలెక్టర్

ఖమ్మం, జూన్ 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనుదీప్ దురిశెట్టి.. శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రగతిభవన్‌లో ఉపముఖ్యమంత్రి భట్టిని కలిసిన అనుదీప్ ఆయనకు బొకే అందించారు. ఇక బంజారాహిల్స్‌లో మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి తుమ్మలను కలవగా.. ఈ సందర్భంగా తుమ్మల కలెక్టర్‌ను సత్కరించారు. అలాగే మంత్రి పొంగులేటిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసిన కలెక్టర్ బొకే అందించారు.

సీఎం రేవంత్ చీఫ్ పీఆర్వోగా జిల్లా వాసి మల్సూర్

- ఇప్పటికే చంద్రబాబు చీఫ్ పీఆర్వోగా రమేష్
- ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రుల వద్ద మనోళ్ల కీలక బాధ్యతలు



ఖమ్మం, జూన్ 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చీఫ్ పీఆర్వోగా గుర్రం మల్సూర్ నియమితులయ్యారు. రాష్ట్ర కో ఆపరేటివ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా, పరిశ్రమలశాఖ డైరెక్టర్‌గా పనిచేసిన మల్సూర్ ఇటీవల పదవీ విరమణ చేశారు. జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం ఆయన స్వగ్రామం కాగా.. కో ఆపరేటివ్‌శాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన కీలకమైన సీఎం చీఫ్ పీఆర్వోగా బాధ్యతలు చేపట్టారు. కాగా పూర్వపు ఖమ్మంజిల్లాలోని కూనవరం మండలం కాచవరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఆలూరి రమేష్ ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి చీఫ్ పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే జిల్లాలోని కారేపల్లి మండలం కమలాపురానికి చెందిన డి.విజయ్‌కుమార్ తెలంగాణ సీఎం రేవంత్ వద్ద పీఆర్వోగా విధుల్లో ఉన్నారు.

సింగరేణి డైరెక్టర్ (పా)గా గౌతమ్ పోట్రు బాధ్యతలు

కొత్తగూడెం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థలో డైరెక్టర్ పర్సనల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ (పా)గా నియమితులైన గౌతమ్ పోట్రు శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సంస్థ చైర్మన్ ఎండీ ఎన్. బలరాం సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలను డైరెక్టర్ ప్రాజెక్టు అండ్‌ప్లానింగ్ కే.వెంకటేశ్వర్లు అదనపు బాధ్యతగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గౌతమ్‌పోట్రుకు సీఎండీ బలరాం శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కే. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్‌మూమెంట్ ఎస్‌డీ ఎం.సుభాని, జీఎం మార్కెటింగ్ ఎస్‌వీ రాజశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.



గౌతమ్ పోట్రుకు శుభాకాంక్షలు తెలిపిన సీఎండీ బలరాం

ఎస్సీ కార్పొరేషన్ భద్రాద్రి ఈడీగా అనసూర్య



చుంచుపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యనిర్వాహక సంచాలకురాలు (ఈడీ)గా దాసరి అనసూర్య శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని మొక్కను అందజేశారు. ప్రస్తుతం అనసూర్య జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిగా కొనసాగుతుండగా.. ఈడీగా బాధ్యతలు చేపట్టడంతో షెడ్యూల్డ్ కులాల ఇన్‌చార్జ్ అభివృద్ధి అధికారిగా కొనసాగనున్నారు. ఇక ఈడీగా బాధ్యతలు చేపట్టిన అనసూర్యకు వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

సెంట్రల్ డీఎస్పీగా వరప్రసాద్ ఎంపిక



కారేపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేకలతండాకు చెందిన బానోత్ రామ్మూర్తి కుమారుడు లక్ష్మీ వరప్రసాద్ సెంట్రల్ డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు. యూపీఎస్సీ నిర్వహించిన సీఏపీఎఫ్ పరీక్షలో 256 ర్యాంకు సాధించి సెంట్రల్ డీఎస్పీగా సెలక్ట్ అయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలో డిగ్రీ పూర్తి చేసి సోషియాలజీలో పీజీ చేసిన లక్ష్మీవరప్రసాద్ యూపీఎస్సీ పరీక్షలో ప్రతిభ చూపారు.

లోక్ అదాలత్‌తో కేసుల నుంచి శాశ్వత విముక్తి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్ జూన్14(ఆంధ్రజ్యోతి): ఇరుపక్షాల రాజీచేసుకున్న కేసులకు లోక్‌అదాలత్‌తో శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అంతిమ తీర్పుపై ఎలాంటి అప్పీల్‌కు అవకాశం ఉండదని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం జిల్లా ప్రధాన న్యాయాధికారి, న్యాయసేవాధికార సంస్థ కార్యాలయ ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ చంద్రశేఖరరావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.ఉమాదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని.. సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులను రాజీచేసుకోవాలని, దానికి ఎలాంటి రుసుం, సమయం వెచ్చించాల్సిన అవసరం లేదని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ఖమ్మంజిల్లాలో ఇప్పటి వరకు 3,500సివిల్, క్రిమినల్ కేసులను రాజీచేశామని, 62మోటారు వెహికల్ ప్రమాదకేసుల్లో రాజీ ద్వారా రూ.2.80 కోట్ల పరిహారం ఇప్పించామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడే పవిత్ర బాధ్యత న్యాయవాదులపై ఉంటుందని, వారి సేవలను ప్రతీ ఒక్కరు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు కర్రి ఉమాదేవి, దేవినేని రాంప్రసాదరావు వి.శీనయ్య, ఎం అర్చనకుమారి, ఎం.కల్పన, టి.మురళీమోహన్, కేవీ చంద్రశేఖరరావు, కాసరగడ్డ దీప, బెక్కం రజని, ఏపూరి బిందుప్రియ, వి.మాధవి, బార్ అసోసియేషన్ కార్యదర్శి గద్దల దిలీప్‌కుమార్, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు బండారుపల్లి గంగాధర్, పి.సంధ్యారాణి, కొత్తపల్లి రామారావు పాల్గొన్నారు

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 20,427 కేసుల పరిష్కారం

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 20,427 కేసులను పరిష్కరించారు. జిల్లా కోర్టులో నాలుగు కేసులు ఒకటో అదనపు జిల్లా కోర్టులో ఏడు, రెండో అదనపు జిల్లా కోర్టులో 15 కేసులు. ఎస్టీ, ఎస్సీ 12 కేసులు, ఫ్యామిలీ కోర్టులో 8 కేసులు, మహిళా కోర్టులో 15, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో 6 కేసులు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 442, ఒకటో అదనపు అదనపు ప్రథమ శ్రేణి కోర్టులో 1,017 కేసులు, రెండో అదనపుప్రథమ శ్రేణి కోర్టులో 967, మూడో అదనపు ప్రథమ శ్రేణి కోర్టులో 570, మొబైల్ కోర్టులో 1305, ఎక్సైజ్ కోర్టులో 58, లీగల్ సర్వీస్ అథారిటీలో 73, లేబర్ కోర్టులో 1, సత్తుపల్లిలో 563 మధిరలో 530 కేసులు, ట్రాఫిక్ చలానా, సైబర్ నేరాల కేసులు 14,207 కేసులు పరిష్కారమైనట్టు న్యాయాధికారులు వెల్లడించారు.



వృద్ధురాలికి అవార్డు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి

45లక్షల మొక్కలు నాటాలి

- సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో 675 హెక్టార్లలో 45లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరాం ఆదేశించారు. శనివారం ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల్లోని జీఎంలతో వివిధ అంశాలపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు సాధ్యమైనన్నీ మొక్కలు నాటే విధంగా చొరవ చూపాలని కోరారు. నీటి బిందువు జలసింధువు కార్యక్రమంలో భాగంగా మొత్తం 62 మిని చెరువుల నిర్మాణంలో ఇప్పటికే 60చెరువులు పూర్తవడం సంతోషకరమని, మిగిలిన చెరువులు కూడ మరో వారం లోపు పూర్తి చేయాలన్నారు. సింగరేణి వ్యాప్తంగా సమీప గ్రామాల్లో 43 చెరువుల్లో మట్టి పూడికలు తీయాలని నిర్ణయించామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

విత్తన చట్టం.. రైతులకు మేలు చేసేదిగా ఉండాలి

- ఆ దిశగా రూపకల్పనకు సలహాలు ఇవ్వాలి
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి
- ముసాయిదా బిల్లుపై ఖమ్మం కలెక్టరేట్‌లో కమిటీ సమావేశం
- హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు, విత్తన డీలర్లు, రైతు సంఘాల ప్రతినిధులు

ఖమ్మంకలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : విత్తన చట్టం రైతులకు మేలు చేసే విధంగా ఉండాలని, ఆ కోణంలో విత్తన చట్టం రూపకల్పన జరిగేలా సలహాలు అందించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అధికారులు, విత్తన డీలర్లు, రైతు సంఘాల ప్రతినిధులను కోరారు. విత్తన చట్టం ముసాయిదా బిల్లుపై శనివారం ఆయన ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి తో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాల కారణంగా రైతులు నష్టాలు పాలవుతున్నారని, ఎన్నికల సమయంలో వారికిచ్చిన మాట ప్రకారం సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి సారథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర పరిధిలో చట్ట ప్రకారం రైతులను ఆదుకునేందుకు విత్తన చట్టం ముసాయిదా బిల్లు తయారు చేసిందన్నారు. విత్తన చట్ట ముసాయిదా బిల్లుపై రైతుల అభిప్రాయాలను తెలుసుకొని, ఎలాంటి అంశాలు చేరిస్తే రైతులకు మేలు జరుగుతుందో తెలుసుకునేందుకు ప్రతి ఉమ్మడి జిల్లా పరిధిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పత్తి, మిర్చి సాగు చేసే రైతులు చాలా కాలంగా నష్టపోతున్నారని, రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతులు లేబుల్ లేని విత్తనాల ప్యాకెట్లు, లూజ్ విత్తనాలను కొనుగోలు చేయొద్దన్నారు. ప్రతీ జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు (మిగతా 2వ పేజీలో)

రక్తనిధి కేంద్రాల బలోపేతం

- హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న హెల్త్ డైరెక్టర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/ బూర్గంపాడు, జూన్14(ఆంధ్రజ్యోతి): రక్తనిధి కేంద్రాలను బలోపేతం చేసేలా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా కొత్తగూడెం సర్వజన ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో నాలుగు రక్త నిల్వ యూనిట్ల స్థాపనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలపారు. బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర పీహెచ్‌సీని డీహెచ్ రవీందర్ నాయక్ సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించి ఫార్మసీని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్‌నాయక్, సూపరింటెండెంట్ రాధామోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్.జయలక్ష్మి, ఆర్ఎంవో ర మేష్, ప్రోగ్రాం ఆఫీసర్ మధువరణ్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో కళాశాల చైర్మన్ ప్రసాద్

నీట్‌లో న్యూవిజన్‌కు ర్యాంకుల పంట

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో మే 5న నిర్వహించిన నీట్ 2025 పరీక్షా ఫలితాలను శనివారం విడుదల చేశారు. ఈ ఫలితాలలో నగరంలోని న్యూవిజన్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల చైర్మన్ సీహెచ్‌జీకె ప్రసాద్ తెలిపారు. కళాశాలకు చెందిన పి. సంహిత 951, యల్.సాయిచరణ్ సింగ్ 1114, బి.గోపిచంద్ 1187, యం. ఆకాంక్ష 1197, యం.వైష్ణవి 1535, సాయిశృతి 2571, టి.దివ్య 2991, బి.చైతన్య సాయి 3058, బి.అక్షిత 4281, ఆర్.శీతల్ 5553, జె.వివేక్ 5672, బి.యశ్వంత్ 5743, వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ఐఐటీ, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పరిమిత సంఖ్య గల విద్యార్థులతో జాతీయ స్థాయి ర్యాంకులు, ఉత్తమ మార్కులు సాధిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలలో అత్యుత్తమ జూనియర్ కళాశాలగా న్యూవిజన్ నిలిచిందన్నారు. విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గోపిచంద్, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులతో అకాడమీ నిర్వాహకులు

డాక్టర్ మెడికల్ అకాడమీ ఆల్ ఇండియా 307వ ర్యాంక్

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): శనివారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో నగరంలోని డాక్టర్ మెడికల్ అకాడమీ విద్యార్థిని తూము వెన్నెల ఆల్ ఇండియా 307వ ర్యాంక్‌తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ జాతీయ స్థాయి ర్యాంకులు సాధిం చించారని అకాడమీ నిర్వాహకులు రాయల సతీష్‌బాబు, భరణికుమార్ తెలిపారు. అకాడమీకి చెందిన రిషిక శర్మ 588, ఎస్టీ క్యాటగిరీలో ప్రియాంక 171 ర్యాంక్ సాధించారని తెలిపారు. వీరితో పాటు అతియా తరణమ్ 509, ఎ.వర్ష 505, కె.మోక్షిత శరణ్య 496, షేక్.నమీన మధార్ 496, పి.రేణుశ్రీ 489, యశ్వంత్ 482, అయేషా సమీర 481, సిహెచ్ క్షేత్ర 474. జి.వెన్నెలరెడ్డి 467, కెవి.నిక్షిత 463, జి.అనూష 461 పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. రాష్ట్రంలోనే ఓపెన్ క్యాటగిరిలో 11వ ర్యాంక్ సాధించామని తెలిపారు. 6గురు 500ల మార్కుల పైన, 21 మంది 450మార్కుల పైన సాధించారని అన్నారు.



మంచి సర్జన్ కావాలన్నదే ఆశయం : వెన్నెల

జాతీయస్థాయిలో 307వ ర్యాంక్ సాధించటం ఎంతో ఆనందంగా ఉం ది. కష్టపడి చదివి మంచి సర్జన్ కావాలన్నదే నా లక్ష్యం. తల్లిదండ్రుల సహకారం, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే ఈ ర్యాంక్ సాధించగలిగా.

నేడు పాలేరు ముఖ్యనాయకులతో మంత్రి పొంగులేటి సమావేశం

కూసుమంచి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవిన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈమేరకు క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒకప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం 9:30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నియోజకవర్గంలోని కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులతో వేరువేరుగా సమావేశం అవుతారు. ఆయా మండలాలకు చెందిన ముఖ్యనాయకులు సకాలంలో హాజరుకావాలని కోరారు,

సాయంత్రం 4:30గంటల నుంచి తిరుమలాయపాలెం మండలంలో పర్యటిస్తారు. బచ్చోడు, రాజారం, సోలిపురం, కాకరవాయి గ్రామాల్లో పర్యటించి బీటీ రహదారుల నిర్మాణాలకు శంఖుస్థాపన చేస్తారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి పర్యటన విజయవంతం చేయాలని కోరారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి

మణుగూరు టౌన్, జూన్14(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో శనివారం పిడుగుపాటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని రేగులగండి గ్రామానికి చెందిన కుంజా జగన్(40) పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుంగా మార్గమధ్యంలో ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. ఈ క్రమంలో అతడికి సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జగన్‌కు భార్య, నలుగురు పిల్లలున్నారు.



విద్యార్థులతో కళాశాల డైరెక్టర్

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాలలో నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి. శ్రీధర్. డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. కళాశాలకు చెందిన డి.దుర్గా గుజిరి 267, ఎల్.మనోహర్ 541, బి.చందన 1229, వి.రోమిత 2801, బి.భూమిక 3104, జి.శ్రీనిధి జ్యోతిర్మయి 3255, డి.శ్రీలేఖ 3658, డి.స్వరాజ్‌పాల్ 4175, ఏ.లిఖిత 4445, వి.ప్రియాంక 4481, బి.రిషిత 5898, జి.హేమశ్రీ 6011, బి.విషి 6293, బి.మన్యశ్రీ 7130, బి.శాలిని 8236, వై.సరస్వతి స్నొర్తిక 8303, బి.సబిత 8439, జి.నవీన్ 11,119 తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, చేతన్ మాథుర్, వర్మ, కృష్ణ, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కళాశాల డైరెక్టర్లు

రెజోనెన్స్ విజయభేరి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్14 (ఆంధ్రజ్యోతి): శనివారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో నగరంలోని రెజోనెన్స్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని డైరెక్టర్లు ఆర్‌వీ.నాగేంద్రకుమార్, కొండ. శ్రీధర్‌రావులు తెలిపారు. కళాశాలకు చెందిన వైఎస్.రెడ్డి 460, ఎన్ రామ్‌చరణ్ 460, ఎన్.మాల్యాద్రి 444, ఎస్.లావణ్య 442, ఎస్‌కె. బీణా 407, ఎస్. అజయ్ కుమార్ 372, బి. హరి క్రిష్ణ 330, జి. లావణ్య 325వంటి అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సతీష్, బాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నీట్‌లో కృష్ణవేణి ఐఐటీ మెడికల్ అకాడమీ విజయకేతనం



రాగ్ని



నందిని

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాలలో నగరంలోని కృష్ణవేణి మెడికల్ అకాడమీ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావులు తెలిపారు. కళాశాలకు చెందిన సిహెచ్. రాగ్ని 556, బి.నందిని 505, జి.కావ్య 479, వై.గీతికశ్రీ 479, జి.అశ్విన్ 467, వి.అనిల్‌కుమార్ 456, బి.చార్మి 449, ఎస్. గీతశ్రీ 447, జి.మరిణి 441, ఎస్.మాధవన్ 434, సిహెచ్.శోభారాణి 430, ఎస్.దివ్యశ్రీ 424, ఆర్. దుర్గమహేష్ 423, ఎం.దేవంశీష్ 421, కె.మోహత్ కుమార్ 420తోపాటు పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. అనంతరం ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యజమాన్యం, అధ్యాపకులు, అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, ఏలూరి. వంశీకృష్ణ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



రామాలయంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

రామయ్యను దర్శించిన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

భద్రాచలం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. వరుస సెలవుదినాలు రావడంతో భద్రాద్రి రామాలయం శనివారం భక్తుల సందడి నెలకొంది. ఏపీలోని విజయవాడ కస్తూరిబాయి పేట ఎన్టీఆర్ కాలనికి చెందిన చిన్నబాబు పుష్పాంజలి దంపతులు స్వామివారికి నిత్యాన్నదానం నిమిత్తం రూ.1,00,005లు అందజేశారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు.

హార్వెస్ట్ విద్యార్థుల హవా



నయమాంజలి



రాణి ఉమా అలేఖ్య

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాలలో నగరంలోని హార్వెస్ట్ విద్యార్థులు ఉన్నతశేణి ఫలితాలు సాధించారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డిలు తెలిపారు. కళాశాలకు చెందిన తమన్నా డివిఎస్. నయమాంజలి 564 మార్కులతో 3321 క్యాటగిరీ ర్యాంకు, జి.రాణి ఉమా అలేఖ్య 544 మార్కులతో 6586 క్యాటగిరీ ర్యాంకు సాధించారని, అదేవిధంగా బి, భార్గవి 449, జి.శ్రీమయి 356, ఎండి.అన్షియా ముస్కాన్487, ఎండి షయాన్ మునీబ్ 433, ఎస్. జాహ్నవి 377 వంటి అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. అదేవిధంగా మిగతా కొందరు విద్యార్థినీ విద్యార్థులు కూడా వివిధ విభాగాల్లో సీట్లు సాధించే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి అభినందించారు.

21, 22వ తేదీల్లో టీయూసీఐ మహాసభలు

పెనుబల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో ఈనెల 21, 22వ తేదీల్లో జరిగే ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల యూనియన్ జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. శనివారం పెనుబల్లి ఆస్పత్రిలో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని, వృద్ధాప్యంలో కనీస భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాపారావు, సరోజిని, రాములి, రమణ, నాగమ్మ, శిరీష, బీబీ, ఖైరానా పాల్గొన్నారు.

18 నుంచి ఒలింపిక్ డే రన్



మాట్లాడుతున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు

పాల్వంచ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 18 నుంచి ఒలింపిక్ రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి తెలిపారు. శనివారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 23 వరకు ఒలింపిక్ దినోత్సవ రన్ ప్రారంభమవుతాయని అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి భద్రాచలం, పినపాక, ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో ఒలింపిక్ రన్ క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. సుమారు వెయ్యిమంది క్రీడాకారులకు ఒలింపిక్ డ్రస్సులను అందజేస్తామన్నారు. 23న జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, అధికారులు ముగింపు కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతారని చెప్పారు. ఈ సమావేశంలో ఒలింపిక్ అసోసియేషన్ చీఫ్ పాట్రాన్ టీపీసీసీ సెక్రటరీ నాగ సీతారాములు, ఒలింపిక్ అసోసియేషన్ చైర్మన్ మహేందర్, వైస్ చైర్మన్ వై. వెంకటేశ్వర్లు, మొగిలి, కార్యదర్శులు ఆదినారాయణ, కోశాధికారి శ్రీధర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు 'స్థానిక' పరీక్ష!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కేడర్‌ను సిద్ధం చేయడమే ఎజెండాగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. అలాగే ఎన్నికల కోడ్ వచ్చేలోపు నియోజకవర్గంలోని రోడ్లు, డ్రెయినేజీల ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు వేగవంతంగా చేపట్టబోతున్నారు.

సన్నద్ధమవుతున్న ఇతర పార్టీలు

స్థానిక ఎన్నికల విషయంలో విపక్ష బీఆర్ఎస్ గతంలో హడావిడి చేసినా.. ప్రస్తుతం కొంత స్తబ్దుగానే ఉంది. ప్రస్తుతానికి గ్రామాల్లో అధికార పార్టీని తట్టుకుని నిలబడే విషయంలో ఆపార్టీ కేడర్‌కు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. భట్టి, తుమ్మల, పొంగులేటి , రేణుకాచౌదరి వర్గాల మధ్య ఉన్న గ్యాప్‌ను పెంచి కాంగ్రెస్‌లోని అసంతృప్త నాయకులతో జతకట్టేందుకు కొందరు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ ఆశావహుల్లో.. అభ్యర్థిత్వాలు దక్కని వారిని రెబల్‌గా పోటీచేయించి, వారికి మద్దతు పలకడం ద్వారా ఎన్నికల పోరులో అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కొని నిలబడాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు అధినాయకత్వం సూచించినట్టు సమాచారం. దీంతో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్‌కు కొందరు ఆశావహులతో మంతనాలు జరుపుతున్నారని, ఒకవేళ కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఇవ్వకపోతే తాము మద్దతిస్తామని పోటీ చేయాలంటూ బీఆర్ఎస్ స్థానిక నేతలు చెబుతున్నట్టు తెలుస్తోంది. ఇలాంటి ఓ విషయాన్ని ఇటీవల రఘునాథపాలెం మండల కార్యకర్తల సమావేశంలో కొందరు మంత్రి తుమ్మలకు వివరించారని సమాచారం. గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మధ్య చిచ్చు పెడుతున్నారని, మీరే పోటీచేయండి అంటూ అందరినీ ప్రోత్సహిస్తున్నారని, కొందరు మైండ్ గేమ్ ఆడుతున్నారని మంత్రికి వివరించారట. దాంతో అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని వారికి మంత్రి తుమ్మల సూచించారు. కాగా ఉమ్మడిజిల్లాలో ప్రస్తుతం వామపక్షాలు చెరోదారిలో ఉన్నాయి. సీపీఐ కాంగ్రెస్‌తో దోస్తీ కొనసాగుతుండగా.. సీపీఎం తటస్థంగా ఉంది. వామపక్ష పార్టీలు ఐక్యంగా కలిసి పోటీ చేసే పరిస్థితి లేదు. సీపీఎం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా నియోజకవర్గ కమిటీల ద్వారా కలిసి వచ్చే పార్టీలతో పొత్తులు కుదుర్చుకునే అవకాశం ఉంది. బీజేపీ ఒంటరిగానే ఎన్నికల బరిలో దిగే ఆలోచనతో ఉంది. మొత్తం మీద రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నగారా మోగించేందుకు సిద్ధంగా ఉండడంతో రాజకీయపార్టీలు ఎన్నికల వ్యూహంలోకి అడుగుపెడుతున్నాయి. సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ తదితర పదవులను ఆశిస్తున్న వారు ఇప్పటికే బరిలో దిగేందుకు సిద్ధమవుతూ.. ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నారు.

11ఏళ్ల బాలికపై యువకుడి అత్యాచారం

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు
- ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో ఘటన
- అలస్యంగా వెలుగులోకి

కారేపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ఆరో తరగతి చదువుతున్న ఓ గిరిజన బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేసిన సంఘటన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ. కారేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆరో తరగతి చదువుతున్న 11ఏళ్ల బాలికపై.. అదేగ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ, 27 ఏళ్ల అవివాహిత యువకుడు భూక్య హరి అత్యాచారం చేశాడు. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం. ఆ బాలిక 13వ తేదీ శుక్రవారం సాయంత్రం 7గంటల సమయంలో కిరాణా దుకాణానికి వెళ్లింది. ఆమెను వెంబడించిన హరి మార్గమధ్యలోనే ఆమెను బలవంతంగా తన బైకుపై ఎక్కించుకుని గ్రామ సమీపంలోని చేను వద్దకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ క్రమంలో బాలిక కేకలు వేయగా సమీప పొలం వద్ద ఉన్న ఓ రైతు గమనించి ఘటనా స్థలం వద్దకు వెళ్లగా నిందితుడు పరారయ్యాడు. ఆ రైతు నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. బాధిత కుటుంబం ఇచ్చిన శనివారం ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసిన్నట్టు కారేపల్లి ఎస్ఐ గోపి తెలిపారు.



వెంకటేశ్వర్లు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ బొడ్లపాటికి మంత్రి తుమ్మల నివాళి

ఖమ్మం రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ బొడ్లపాటి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. శనివారం ఆయన దశదిన కర్మ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బొడ్లపాటి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు, కూతురు ఉండగా.. కుమారులు శ్రీనివాస్‌రావు, పూర్ణచందర్‌రావు ఇద్దరూ హైదరాబాద్‌లోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టులుగా పనిచేస్తున్నారు. వారిని మంత్రి తుమ్మల పరామర్శించారు. మంత్రి వెంట కాంగ్రెస్ జిల్లా నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మండల నాయకులు తమ్మినేని నవీన్, అంబటి సుబ్బారావు, పోలూరి రమేష్, గ్రామస్థులు గోపాల్, వెంకటేశ్వర్లు, జగన్, అంబేద్కర్, శ్రీధర్, రమణ పాల్గొన్నారు.

విత్తన చట్టం.. రైతులకు మేలు చేసేదిగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రైతులు అధికారులతో సమన్వయంతో నకిలీ విత్తనాలుఅరికట్టేందుకు కృషి చేయాలని అన్నారు. రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రైతులు స్వయంగా విత్తనాలు ఉత్పత్తి చేసుకొని పంటలు పండించేవారని, నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గతంలో ములుగు జిల్లాలో నకిలీ మొక్కజొన్న విత్తనాల ద్వారా 4వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే రైతులకు రూ.4 కోట్ల పరిహారాన్ని సంబంధిత కంపెనీ ద్వారా అందించినట్లు వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది జరిగినా రైతు సంక్షేమ కమిషన్‌కు ఫిర్యాదుచేస్తే బాధిత రైతుకు న్యాయం జరిగేలా కృషిచేస్తామన్నారు. గతంలో పేదలు తిన్న ఆహారం నేడు ధనవంతులు తింటున్నారని తెలిపారు. వరి పంటతో పాటు పప్పు దినుసులకు కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. గత సంవత్సరం 21 వేలు ఉన్న మిర్చి పంట ఈ సంవత్సరం 12 వేలకు పడిపోయిందని, దీని వల్ల రైతులు నష్టపోయారని తెలిపారు. న్యాయవాది సునీల్ మాట్లాడుతూ విత్తన చట్టం కోసం రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లు తయారు చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. ఒప్పంద వ్యవసాయం పేరిట రకరకాల సాగు జరుగుతోందని అన్నారు. కొత్త చట్టంలో రైతుల కోణంలో ఎలాంటి నిబంధనలు ఉంటే బాగుండాలో సూచనలు అందించాలన్నారు. నాణ్యత లోపాలతో రైతుకు నష్టం కలిగితే పరిహారం పొందే విధానం ఉండాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతు.. వినియోగదారుడు అవుతారని నష్టపోతే, వినియోగదారుల ఫోరానికి వెళ్లొచ్చంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని వివరించారు. రైతుకు కలిగిన మానసిక క్షోభకు కూడా అక్కడ పరిహారం కోరవచ్చన్నారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ, ప్రభుత్వం విత్తనాల విక్రయాల కోసం ప్రత్యేకంగా సాఫ్ట్ వేర్ తయారు చేసి విత్తనాల ప్యాకేట్ సంబంధించి సర్టిఫికెట్ రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. డిస్ట్రిబ్యూటర్లు నిబంధనలు పాటించేలా కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బీన, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వ్యవసాయ అధికారులు పుల్లయ్య, వి.బాబురావు, అధికారులు పాల్గొన్నారు.



పాల్గొన్న రైతులు

ప్రైవేట్ కంపెనీలు తీసుకుని వచ్చే విత్తనాల జెనెటిక్ శాతాన్ని పరిశీలించాలి. నష్ట పరిహారం తీసుకోవాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి. విత్తనాలను పరిశీలించి ధ్రువీకరణ చేసినవి మాత్రమే రైతులకు అమ్మేలా చూడాలి. విత్తనాల ప్యాకెట్‌పై క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేసి స్కాన్ చేస్తే సర్టిపై వివరాలు వచ్చేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

- రఘురాం, రఘునాథపాలెం

విత్తనాలు ఉత్పత్తి చేసే రైతులకు సంబంధిత కంపెనీలు సరిగ్గా చెల్లింపులు చేయడం లేదు. కంపెనీలు కొంతమంది ఏజెంట్లకు డబ్బులు పంపితే రైతులకు పంచడం లేదు. విత్తనాల కంపెనీ నుంచి నేరుగా రైతులకు చెల్లింపులు వచ్చేలా చూడాలి.

- బొంతు రాంబాబు, వైరా

రాష్ట్రంలో ఎన్ని విత్తనాల కంపెనీలకు ఆర్ అండ్ డీ సెంటర్‌లున్నాయి? అవి ఎక్కడ ఉన్నాయో ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అందించాలి. సంబంధిత కంపెనీ విత్తనాలు సరిగ్గా మొలకలు రాకపోతే కంపెనీ యజమాని, డిస్ట్రిబ్యూటర్, శాస్త్రవేత్తలపై కేసులు నమోదు చేసేలా పటిష్ఠ చట్టం తయారు చేయాలి

- మందడపు సుధాకర్, మంచుకొండ

కంపెనీలు వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు విత్తనాలు అందిస్తే పారదర్శకంగా ఉంటుంది. విత్తనాల ఉత్పత్తి కోసం రైతుల వద్దకి వస్తున్న మధ్యవర్తుల గుర్తింపు కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక రిజిస్ట్రేషన్ సెల్ ఏర్పాటు చేయాలి. ఆయిల్ పామ్ పంట ను కూడా విత్తన చట్టం పరిధిలోకి తీసుకురావాలి.

- భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు

ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్ ఉన్న కంపెనీల నుంచి విత్తనాలు తెచ్చి డీలర్లు అమ్ముకుంటున్నారు. అవి సరిగ్గా పనిచేయని పక్షంలో డీలర్ల పాత్ర ఏం ఉంటుంది. లైసెన్సింగ్ విధానం సరిగ్గా లేదు. కంపెనీ నుంచి కాకుండా బయట నుంచి ఎక్కడైనా విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు అమ్మితే డీలర్లపై చర్యలు తీసుకోవాలి.

- మనోహర్, డీలర్ల అసోసియేషన్ ప్రతినిధి, ఖమ్మం



మదన్‌లాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గిరిజనుల హక్కుల కోసం పోరాడిన నేత మదన్‌లాల్

సంస్మరణ సభలో వక్తలు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : తన తుది శ్వాసవరకు గిరిజనుల హక్కులు, వారి సంక్షేమం కోసం పోరాడిన నేత మదన్‌లాల్ అని పలువురు నాయకులు పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలోని జడ్పీ సమావేశ మందిరంలో లంబాడా హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల కన్నుమూసిన వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ సంస్మరణసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మదన్‌లాల్ మరణం గిరిజన ఉద్యమాలకు, సమకాలీన రాజకీయాలకు తీరని లోటన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వైరా నియోజకవర్గంతో పాటు తాను పుట్టి పెరిగిన రఘునాధపాలెం మండల అభివృద్ధి కోసం కృషిచేశారని గుర్తుచేశారు. సాధరణపేద కుటుంబం నుంచి వచ్చిన మదన్‌లాల్ ఆత్మవిశ్వాసంతో, అంచలంచెలుగా ఎదిగి తన జాతి సంక్షేమానికి ఎంతో కృషిచేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండాల కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు కూరాకుల నాగభూషణం, మదన్‌లాల్ సోదరుడు బానోతు సుందర్‌లాల్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు భద్రునాయక్, గుంతేటి వీరభద్రం, షేక్ నజీమా, వీరన్ననాయక్, శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ ప్లస్

ఖమ్మం ● ఆదివారం 15 జూన్ 2025

మోతీలాల్ ఓస్వాల్ బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్

మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ (ఎంఓఎంఎఫ్).. బీఎస్ఈ 1000 ఇండెక్స్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఫండ్. దీని బీఎస్ఈ 1000 టీఆర్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఇండెక్స్ ఫండ్‌లో లార్జ్, మిడ్, స్మాల్, మైక్రోక్యాప్ విభాగాలకు చెందిన కంపెనీలున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. సిప్ రూపంలో కూడా ఇన్వెస్ట్ చేయవచ్చు. ముగింపు తేదీ ఈ నెల 19.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	515
వరంగల్	542	గోదావరి	500
చిత్తూరు	613	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,680 ▲	93,200 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,300 ▲	97,500 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	1,01,400 ▼	93,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	1,01,670 ▲	93,200 ▲	1,09,400 ▲
ప్రొద్దుటూరు	98,100 ▼	90,250 ▼	1,05,000 ▲
ముంబై	99,060 ▲	90,740 ▲	1,06,170 ▲

నేడు ఫాదర్స్ డే. ఈ సందర్భంగా మీ తండ్రికి ఏదైనా బహుమతి ఇవ్వాలనుకుంటున్నారా..? చిన్న పిల్లలిచ్చే చిరు కానుకైనా నాన్నకు కలిగే సంతోషం చెప్పలేనంత. టీనేజీలో ఉంటే.. డాడీ ఇచ్చే పాకెట్ మనీతో గిఫ్ట్ కొని ఆయన్ని సంబుర పెట్టవచ్చు. ఇప్పటికే ప్రయోజకులై, సంపాదిస్తుంటే మాత్రం కాస్త భిన్నంగా ఆలోచించండి. మీ జీవితానికి సుస్థిర బాట వేసిన నాన్న భవిష్యత్‌కు ఆర్థిక భరోసా కల్పించే కానుక అందించడం మేలు.



లవ్ యూ U నాన్న

Happy Father's Day

ఆరోగ్య బీమా

వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరగడం సాధారణం. కానీ, ఈ రోజుల్లో వైద్యం చాలా ఖరీదైపోయింది. దేశంలో వైద్య ఖర్చులు ఏటా 14 శాతం చొప్పున పెరుగుతున్నాయని ఓ సర్వే వెల్లడించింది. ఈ ప్రత్యేక దినోత్సవం సందర్భంగా మీ నాన్న ఆరోగ్యానికి బీమాతో ధీమా కల్పించండి. మీ నాన్న పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ కొనుగోలు చేయడం మేలు. మీ తండ్రి గారికి ఇప్పటికే దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలుంటే వాటికీ బీమా కవరేజీ లభించేలా పాలసీ తీసుకోవడం ఉత్తమం. ఒకవేళ మీ తండ్రి వయసు 50-60 ఏళ్ల పైబడితే, క్యాన్సర్, గుండెపోటు వంటి తీవ్ర అనారోగ్యాల ఖర్చులకూ కవరేజీ కల్పించే క్రిటికల్ ఇల్‌నెస్ పాలసీని తీసుకోవడం మంచిది.

రిటైర్మెంట్ ప్లాన్

మీ నాన్నకు రిటైర్మెంట్ ప్లాన్ బహుమతిగా ఇవ్వండి. లేదా ఆయన పేరిట యూనిట్ లింక్డ్ పెన్షన్ ప్లాన్ (యూఎల్‌పీపీ)లో ఇన్వెస్ట్ చేయొచ్చు. సాధారణంగా ఈ పథకాలు ఈక్విటీలతో పాటు రుణపత్రాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటాయి. కాబట్టి, దీర్ఘకాలంలో మంచి ప్రతిఫలాలు లభించే అవకాశం ఉంటుంది. ఈ పాలసీ గడువు ముగిశాక, పోగైన కార్పస్‌లో 60 శాతం వెనక్కి తీసుకొని, మిగతా సొమ్ముతో నెలవారీ పెన్షన్ లభించేలా ప్లాన్ చేయండి. తద్వారా మలి వయసులో మీ నాన్నకు ఆర్థిక స్వేచ్ఛ కల్పించండి. అంతేకాదు, మన సగటు ఆయుష్షు 80 ఏళ్లకు పెరిగింది. కాబట్టి, రిటైర్మెంట్ తర్వాత 20-30 ఏళ్ల వరకు మీ నాన్నకు ప్రతినెలా ఖర్చులకు సరిపడా సొమ్ము చేతికందేలా దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టండి.

పొదుపు పథకాలు

మీ తండ్రి పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయవచ్చు. ఒకవేళ సీనియర్ సిటిజన్ అయితే, అధిక వడ్డీ చెల్లించే పొదుపు పథకాలు చాలా అందుబాటులో ఉన్నాయి. బ్యాంకులు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వీరి కోసం ప్రత్యేక పథకాలను ఆఫర్ చేస్తున్నాయి. లేదంటే, ఏదైనా మ్యూచువల్ ఫండ్ స్కీమ్ లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. క్రమానుగత పెట్టుబడి పథకాలు (సిప్) కూడా మంచి ప్రత్యామ్నాయం.

షేర్లు, సెక్యూరిటీలు

భవిష్యత్‌లో మంచి ప్రతిఫలాలు అందించేందుకు అవకాశాలున్న కంపెనీల షేర్లను కానుకగా ఇవ్వండి. ప్రభుత్వ సెక్యూరిటీల్లోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. కొంత రిస్క్ తీసుకోగలిగితే, మంచి రేటింగ్ కలిగిన కార్పొరేట్ బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

యాడ్ ఆన్ కార్డ్

మీ క్రెడిట్ కార్డుపై యాడ్ ఆన్ కార్డు తీసుకోగలిగే వెసులుబాటు ఉంటే.. దాన్ని మీ నాన్నకు గిఫ్ట్‌గా ఇవ్వవచ్చు. తద్వారా చిన్న మొత్తాల్లో ఖర్చుల కోసం వారు ఆ కార్డును ఉపయోగించుకునే వీలుంటుంది.

దేశ ఆర్థికాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర ఎంతో కీలకం. ముఖ్యంగా వస్తు రవాణా సేవలు (ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్) సరిగా లేకుంటే ఏ ప్రాంతంలో కూడా పారిశ్రామికాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి జరగదు. ఒక ఫ్యాక్టరీకి ముడి సరుకు కావాలన్నా, తయారైన వస్తువులు బయటకు పోవాలన్నా, ఒక వ్యాపారి సరుకు కొనుగోలు చేయాలన్నా, అమ్మాలన్నా లేదా ఒక రైతు పండించిన పంటను అమ్ముకోవాలన్నా రవాణా సౌకర్యం లేకుంటే ఏదీ జరగదు. ఇంత ముఖ్య పాత్ర పోషిస్తున్న 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్'కు సంబంధించి జీఎస్‌టీ విధివిధానాలు, పన్ను రేటు వివరాలు మీ కోసం. ఇంతకు ముందు సర్వీస్ ట్యాక్స్‌లో కానీ ఇప్పుడు జీఎస్‌టీలో కానీ వస్తు రవాణాకు సంబంధించి 'గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ' అనే ఒక సర్వీస్ ప్రవేశపెట్టడం జరిగింది. దీనినే జీటీఏ అని అంటారు. జీఎస్‌టీలో గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ మీద విధించే పన్ను ఈ జీటీఏకు సంబంధించి ఉంటుంది. మరి జీటీఏ అంటే ఏమిటి? వస్తు రవాణా చేసే ప్రతి వాహనం జీటీఏ కిందకు వస్తుందా?

జీఎస్‌టీ పరిభాషలో చెప్పాలంటే రోడ్డు ద్వారా వస్తు రవాణా చేస్తూ కన్‌సైన్‌మెంట్ నోట్ లాంటివి ఇచ్చే వ్యక్తి లేదా సంస్థను గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ అంటారు. మరి కన్‌సైన్‌మెంట్ నోట్ అంటే ఏమిటి? దీనికి అటుఇటుగా నిర్వచించినప్పటికీ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన వ్యక్తి తన వాహనంలో రవాణా చేసే వస్తువులకు సంబంధించి ఇచ్చే రసీదు. ఇందులో వస్తువులు పంపే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి, రవాణా అవుతున్న వస్తువుల వివరాలతో పాటుగా సరుకు ఎక్కడి నుంచి బయలుదేరుతుంది, ఎక్కడకు రవాణా అవుతుందనే వివరాలు ఇందులో ఉంటాయి. కన్‌సైన్‌మెంట్ నోట్‌కు ఎందుకు అంత ప్రాముఖ్యత ఉందంటే ఎప్పుడైతే ట్రాన్స్‌పోర్టర్ కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో.. ఆ వస్తువులకు సంబంధించిన పూర్తి బాధ్యత వస్తు విక్రయదారుని నుంచి ట్రాన్స్‌పోర్టర్‌కు బదిలీ అవుతుంది. ఆయా వస్తువులు గమ్యస్థానం చేరే వరకు వాటి సంరక్షణ బాధ్యత

గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నారా..!

ఇదీ GST



రాంబాబు గొండాల

అతనిదే. కాబట్టి ఏ వాహనదారుడైతే కన్‌సైన్‌మెంట్ నోట్ ఇస్తాడో అతను మాత్రమే జీటీఏ కింద పరిగణించబడతాడు. అతను మాత్రమే జీఎస్‌టీ పరిధిలోకి వస్తాడు. అంటే రోడ్డు మీద ఉండే చిన్న వాహనాలు, ఆటో సర్వీస్‌లు జీటీఏ పరిధిలోకి రావు. ఎందుకంటే ఇవి సాధారణంగా ఎలాంటి కన్‌సైన్‌మెంట్ నోట్ ఇవ్వవు.

మరి జీటీఏ కిందకు వచ్చే వ్యక్తి ఎంత పన్ను కట్టాలి? జీటీఏకి సంబంధించి రెండు రకాల పన్ను శ్లాబులు ఉన్నాయి. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాడుకుంటే 12 శాతం లేకుంటే 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది.

అయితే జీటీఏ ఈ కింది కేటగిరిలోని వ్యక్తులకు సర్వీస్ అందజేస్తే సదరు సర్వీస్‌ను రివర్స్ చార్జ్ కింద పరిగణించి ఆయా సేవలు అందుకునే వ్యక్తులు 5 శాతం చొప్పున పన్ను కట్టాల్సి ఉంటుంది. అవేమిటంటే.. ఏదేనీ ఫ్యాక్టరీ, సొసైటీ, కో-ఆపరేటివ్ సొసైటీ, జీఎస్‌టీ కింద రిజిస్టర్ అయిన వ్యక్తులు, బాడీ కార్పొరేట్, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్, క్యాజువల్ ట్యాక్సబుల్ పర్సన్ మొదలైనవి. అంటే, ఎప్పుడైతే ఒక జీటీఏ పైన తెలిపిన కేటగిరీలోని వ్యక్తులకు లేదా సంస్థలకు సరుకు రవాణా చేస్తేంటే.. ఆయా వ్యక్తులు లేదా సంస్థలు రివర్స్ చార్జ్ మెకానిజం (ఆర్‌సీఎం) కింద 5 శాతం పన్ను చెల్లించాలి. ఇలాంటి సందర్భంలో జీటీఏకి ఐటీసీ పొందే అర్హత ఉండదు. అంటే వారు కొనే లారీల మీద లేదా ఇతర సర్వీసుల మీద ఐటీసీ పొందే అర్హత కోల్పోతారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని తనంతట తానే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందే సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కానీ పన్ను 12 శాతం చొప్పున కట్టాలి. అంటే ఒక జీటీఏ తనంత తానే ట్యాక్స్ కట్టాలంటే (ఫార్వర్డ్ ట్యాక్స్ మెకానిజం) కచ్చితంగా 12 శాతం చెల్లించాలి. ఒకసారి ఈ విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో ఉండాలి.

అయితే 2022 జూలైలో దీనికి మళ్లీ సవరణ చేయటం జరిగింది. దీని ప్రకారం ఫార్వార్డ్ మెకానిజంలో రెండు రకాల ఆప్షన్స్ ఇవ్వటం జరిగింది. 5 శాతం, 12 శాతం అంటే జీటీఏ తనే ట్యాక్స్ కడుతూ ఐటీసీ పొందాలంటే 12 శాతం ఎంచుకోవాలి. ఒకవేళ 5 శాతం ఎంచుకుంటే ఐటీసీకి అర్హత ఉండదు. ఇది ఏదీ కాకుండా సర్వీస్ పొందిన వ్యక్తి పన్ను కట్టాలంటే ఆర్‌సీఎం విధానాన్ని ఎంచుకోవాలి. అప్పుడు కూడా ఐటీసీ అర్హత ఉండదు. మరి ఏ విధానం ఎంచుకున్నాడో ఎలా తెలవాలంటే.. తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తాను ఎంచుకునే విధానానికి సంబంధించి అనెగ్జర్-V ను మార్చి 15లోపు దాఖలు చేయాల్సి ఉంటుంది. అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో తాను ఏ పన్ను విధానాన్ని ఎంచుకుంటున్నది 2025 మార్చి 15లోపు తెలియజేయాలి. ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఒకసారి ఒక విధానాన్ని ఎంచుకుంటే ఆ ఆర్థిక సంవత్సరం మొత్తం అదే విధానంలో కొనసాగాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

వ్యక్తిగత రుణం తీసుకుంటున్నారా!

ఈ నిబంధనలు తెలుసుకోండి..



ప్రస్తుత ప్రపంచంలో ఎక్కువ మంది అప్పుల అప్పారావులే. ఖర్చులు ఆదాయాన్ని మించిపోయినప్పుడు ఎవరైనా అప్పులు చేయక తప్పదు. ఆరోగ్య బీమా లేకుండా ఆరోగ్యం దెబ్బతిన్నప్పుడు, ఇంటి రిపేర్లు, లేదా ఇతర అత్యవసర ఖర్చుల కోసం అప్పులు చేయక తప్పదు. ఈ రోజుల్లో చేబదులు ఇచ్చే వాళ్లు తక్కువ. అప్పుడు వ్యక్తిగత రుణాలే గతి.

బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) నుంచి వ్యక్తిగత (పర్సనల్) రుణాలు తీసుకునే వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. కొద్దిగా రిస్క్ ఉన్నా వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఈ రుణాలు ఇచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ప్రస్తుతం బ్యాంకు రుణాల్లో దాదాపు 36 శాతం ఈ రుణాలే. దీన్ని బట్టి బ్యాంకులు కూడా ఈ రుణాలపై ఎంత ఆసక్తితో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కాకపోతే కొన్ని అర్హతలకు లోబడి మాత్రమే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాలు ఇస్తాయి. ఆ అర్హతలు ఏమిటో తెలుసుకుందాం.

రుణ అర్హతలు: వ్యక్తిగత రుణాల మంజూరుకు ప్రతి బ్యాంకు, ఎన్‌బీఎఫ్‌సీ కొన్ని నిబంధనలు పాటిస్తుంది. ఈ అర్హతలు ఆయా సంస్థలను బట్టి వేరు వేరుగా ఉంటాయి. అయితే అన్ని సంస్థలు రుణం తీసుకునే వ్యక్తి కనీస ఆదాయం, క్రెడిట్ స్కోరు, వయసు, చేస్తున్న ఉద్యోగం, తీసుకునే రుణాన్ని ఎంత కాలంలో చెల్లిస్తాడు? అనే విషయాలను తప్పనిసరిగా చూస్తాయి. పై విషయాల ఆదారంగా వ్యక్తిగత రుణం తీసుకున్న వ్యకికి ఎంత రుణం మంజూరు చేయవచ్చు? ఆ రుణం తీసుకున్న వ్యక్తి ఆ రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించగలడా? లేదా? అనే అంశంపై బ్యాంకులు ఒక అవగాహనకు వస్తాయి. ప్రస్తుతం చాలా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఈ రుణాల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ చేశాయి. ఆయా బ్యాంకుల వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ కేవైసీ వివరాలు, కావాల్సిన ఈఎంఐ ప్లాన్ ఎంటర్ చేస్తే వ్యక్తిగత రుణ మంజూరుకు మీకు అర్హత ఉన్నదీ, లేనిదీ బ్యాంకులు వీలైనంత త్వరగా తెలియజేస్తాయి. ఈ రుణాల కనీస వడ్డీ 10.5 శాతం నుంచి ప్రారంభమవుతుంది.

ప్రధాన అర్హతలు

- 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్కులై ఉండాలి
- కనీస క్రెడిట్ స్కోర్ 700 పైన ఉండాలి
- ఉంటున్న నగరాన్ని బట్టి కనీస నెలవారీ ఆదాయం
- ఎన్నాళ్ల నుంచి ఆయా సంస్థల్లో పని చేస్తున్నారు
- స్వయం ఉపాధా లేక ఉద్యోగమా?
- ఇతర రుణాల చెల్లింపు భారమేమైనా ఉందా లేదా అనే అంశం

తెలుసుకోవడం ఎలా?

వ్యక్తిగత రుణాలకు మనకు అర్హత ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇందుకు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అనేక ఫ్రీ టూల్స్ ఉన్నాయి. ఆ వెబ్‌సైట్లలోకి లాగిన్ అయి మీ వయసు, ఆదాయం, ఉద్యోగం, ఇప్పటికే ఉన్న అప్పుల వంటి వివరాలు నమోదు చేస్తే చాలు. మీరు ఎంత వ్యక్తిగత రుణానికి అర్హులో వెంటనే తెలిసిపోతుంది.

స్పోర్ట్స్

ఒలింపిక్ చాంపియన్‌కు ఆర్య జోడీ షాక్

వరల్డ్‌కప్‌లో స్వర్ణం కైవసం



మ్యూనిచ్: ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చిన భారత షూటింగ్ జోడీ ఆర్య బోర్స్-అర్జున్ బబుతా స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో శనివారం జరిగిన 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఈవెంట్ స్వర్ణ పోరులో ఆర్య-అర్జున్ జంట 17-7తో చైనాకు చెందిన వరల్డ్ చాంపియన్ ద్వయం జీఫీ వాంగ్-లిహావో షెంగ్‌ను చిత్తు చేసింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అర్జున్ (317.7 పాయింట్లు), ఆర్య (317.5)లు మొత్తం 635.2 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలవగా.. షెంగ్-వాంగ్ జంట 635.9 పాయింట్లతో అగ్రస్థానాన్ని సొంతం చేసుకొన్నారు.

రెండు దశలలో రంజీట్రోఫీ

దేశవాళీ టోర్నీలో మార్పులు

న్యూఢిల్లీ: ఈసారి రంజీ ట్రోఫీ (2025-26) అక్టోబరు 15 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రెండు దశలలో జరగనుంది. ఈమేరకు శనివారం జరిగిన బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్ణయించింది. అలాగే ఈ సీజన్ రంజీట్రోఫీలో మార్పులు కూడా చోటు చేసుకోనున్నాయి. వచ్చే సీజన్‌నుంచి ప్లేట్‌గ్రూపు నుంచి ఎలీట్‌కు ఒక్కోజట్టు మాత్రమే పదోన్నతి, రెలిగేషన్ అవనున్నాయి. రంజీ తొలి దశ అక్టోబరు 15 నుంచి నవంబరు 19 వరకు, రెండో దశ జనవరి 22 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహిస్తారు. నాకౌట్ ఫిబ్రవరి 6 నుంచి 28 వరకు జరుగుతుంది. దులీప్ ట్రోఫీని ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 15 వరకు నిర్వహిస్తారు. ఇరానీ కప్ అక్టోబరు ఒకటి నుంచి 5 వరకు జరుగుతుంది. ముస్తాక్ అలీ టోర్నీలో సూపర్ లీగ్ విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. అలాగే ప్లేట్ గ్రూప్‌నూ పునఃపవేశపెడుతున్నారు.

హైదరాబాద్, విశాఖలో కివీస్ మ్యాచ్‌లు!

వచ్చే ఏడాది జనవరిలో మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. జనవరి 11 నుంచి 31 వరకు సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో భాగంగా జనవరి 11న జరిగే తొలి వన్డేకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనున్నట్టు తెలిసింది. రెండో వన్డే రాజ్‌కోట్ (జనవరి 14), మూడో వన్డే ఇండోర్ (జనవరి 18), తొలి టీ 20 నాగ్‌పూర్ (జనవరి 21), రెండో టీ20 రాంచి (జనవరి 23), మూడో టీ20 గువాహటి (జనవరి 25), నాలుగో టీ 20 విశాఖపట్నం (జనవరి 28), ఐదో టీ20 తిరువనంతపురం (జనవరి 31)లో జరగనున్నట్టు సమాచారం.


ప్రణతికి కాంస్యం

ఆసియా జిమ్నాస్టిక్స్



న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రణతి నాయక్ ఆసియా సీనియర్ మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ వాల్ట్ విభాగంలో కాంస్యం సాధించింది. దక్షిణకొరియాలోని జెచియాన్‌లో శనివారం జరిగిన ఫైనల్లో 30 ఏళ్ల ప్రణతి 13.466 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానం దక్కించుకుంది. యిహాన్ ఝూంగ్ (చైనా, 13.650) స్వర్ణం, థీ క్విన్ (వియత్నాం, 13.583) రజతం నెగ్గారు. భారత్‌కే చెందిన ప్రొతిష్ట సమంత (13.016) నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ప్రదర్శనతో ఆసియా స్థాయి పోటీలలో 3 పతకాలు అందుకున్న భారత జిమ్నాస్ట్‌గా ప్రణతి రికార్డుకెక్కింది. దీంతో దీపా కర్మాకర్ (రెండు పతకాలు)ను అధిగమించింది. 2019, 2022 ఆసియా చాంపియన్‌షిప్స్‌లో ప్రణతి కాంస్యాలు నెగ్గింది.

ఢిల్లీ చెస్ విజేత అభిజిత్



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓపెన్ చెస్ టైటిల్‌ను భారత జీఎం అభిజిత్ గుప్తా (8.5 పాయింట్లు) సొంతం చేసుకున్నాడు. 9వ రౌండ్‌లో మిహాయిల్ (బెలారస్)పై కీలక విజయం సాధించిన అభిజిత్.. ఇంటర్నేషనల్ మాస్టర్ ఆరోనిక్ ఘోష్‌తో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు. నికీ టిస్కో (బెలారస్) రెండో, భారత గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్ మూడో స్థానంలో నిలిచారు.

'బన్నీ హాప్స్' క్యాచ్‌లు కుదరవు..

దుబాయ్: బౌండరీల దగ్గర పట్టే 'బన్నీ హాప్స్' క్యాచ్‌ల విషయంలో మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. క్యాచ్ విషయంలో ఫీల్డర్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉంటే మైదానంలో ఉన్నప్పుడే బంతిని పైకి విసిరి.. లైన్ దాటి తిరిగి లోనికి వచ్చే అందుకోవాల్సి ఉంటుంది. అంటే బౌండరీ బయట బంతిని పలుమార్లు ఎగర వేయడం కుదరదు. ఈనెల నుంచే కొత్త రూల్ ఐసీసీ ప్లేయింగ్ కండిషన్‌లో భాగం కానుండగా.. వచ్చే ఏడాది అక్టోబరు నుంచి ఎంసీసీ రూల్ ఆఫ్ లాలో అధికారికంగా చేరుస్తారు. మరోవైపు వన్డేల్లో రెండు కొత్తబంతుల నిబంధనల్లో మార్పు, కంకషన్ సబ్‌స్టిట్యూట్ ప్రొటోకాల్‌ను ఐసీసీ ఆమోదించింది.

సఫారీలు సాధించారు

27 ఏళ్ల తర్వాత తొలి ఐసీసీ టైటిల్ సొంతం

వరల్డ్ టెస్టు చాంపియన్‌గా దక్షిణాఫ్రికా

ఫైనల్లో ఆసీస్‌పై ఘన విజయం

ఏళ్లు కాదు.. దశాబ్దాలపాటు ఎదురుచూసిన తరుణమిది. తమ శక్తి యుక్తులన్నీ ధారపోసి పోరాడినా ఐసీసీ టోర్నీల్లో నిరాశగా వెనుదిరగడమే చూసిన దక్షిణాఫ్రికా ఇప్పుడు సగర్వంగా 'గద' ఎత్తుకుంది. ఒత్తిడికి చిత్తయ్యే జట్టంటూ.. చోకర్స్‌గా ముద్ర వేసి క్రీడాలోకం పరిహసించినా.. క్రికెట్ పుట్టినిల్లుగా భావించే లార్డ్స్‌లోనే 'ఇదిగో ఇదీ మా సత్తా' అంటూ వరల్డ్ టెస్టు చాంపియన్స్ హోదాలో పోడియంపై నిలిచింది. బలమైన ప్రత్యర్థి ఆసీస్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో విలవిల్లాడిన బ్యాటర్లు లక్ష్య ఛేదనలో మాత్రం తెగించి నిలబడ్డారు. శతక వీరుడు మార్‌క్రమ్‌తో పాటు చీలమండ గాయం ఇబ్బందిపెట్టినా గెలుపు కోసం కెప్టెన్ బవుమా క్రీజులో నిలిచిన తీరుకు వహ్వా.. అనాల్సిందే. దీంతో 27 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నీల్లో సఫారీలు విజేతలయ్యారు.



ప్రైజ్‌మనీ

దక్షిణాఫ్రికాకు - రూ. 31.05 కోట్లు

ఆస్ట్రేలియాకు - రూ. 18.63 కోట్లు

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 138 ఆలౌట్; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 207 ఆలౌట్ (స్టార్క్ 58 నాటౌట్, క్యారీ 43, లబుషేన్ 22; ఎన్‌గిడి 3/38, రబాడ 4/59); **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** 282/5 (మార్‌క్రమ్ 136, బవుమా 66; బెడింగమ్ 21; స్టార్క్ 3/66).

2 లార్డ్స్ మైదానంలో రెండో అత్యధిక ఛేదన (282)ను సాధించిన జట్టుగా సౌతాఫ్రికా. 1984లో ఇంగ్లండ్‌పై 342 పరుగుల ఛేదనతో విండీస్ టాప్‌లో ఉంది.

3 డబ్ల్యూటీసీలో వరుసగా మూడో సీజన్‌లోనూ కొత్త విజేత రావడం విశేషం. గతంలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చాంపియన్స్‌గా నిలిచాయి.

దక్షిణాఫ్రికా ఆడిన ఐసీసీ ఫైనల్స్

టోర్నీ	ఏడాది	ప్రత్యర్థి
నాకౌట్ ట్రోఫీ	1998	విండీస్‌పై గెలుపు
మహిళల టీ20 వరల్డ్‌కప్	2023	ఆసీస్ చేతిలో ఓటమి
పురుషుల టీ20 వరల్డ్‌కప్	2024	భారత్ చేతిలో ఓటమి
మహిళల టీ20 వరల్డ్‌కప్	2024	కివీస్ చేతిలో ఓటమి
వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్	2025	ఆసీస్‌పై విజయం

లండన్: రెండేళ్ల పాటు అద్భుత విజయాలతో సాగిన దక్షిణాఫ్రికా ప్రయాణం.. ప్రతిష్ఠాత్మక వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంతో ముగిసింది. శనివారం డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను 5 వికెట్ల తేడాతో ఓడించిన బవుమా సేన ఐసీసీ టెస్టు గదను సగర్వంగా అందుకుంది. అలాగే ఈ జట్టుకిది వరుసగా ఎనిమిదో టెస్టు విజయం కాగా.. 1998లో నాకౌట్ ట్రోఫీ తర్వాత రెండో ఐసీసీ టోర్నీ విజయం కావడం విశేషం. అటు ఇప్పటికే పది ఐసీసీ టైటిళ్లను ఖాతాలో వేసుకున్న ఆసీస్ రెండోసారి డబ్ల్యూటీసీ టైటిల్‌పై ఆశలు పెట్టుకున్నా నిరాశే ఎదురైంది. 2010 (టీ20 వరల్డ్‌కప్) తర్వాత కంగారూలు ఓ ఐసీసీ టోర్నీ ఫైనల్లో ఓడడం ఇదే తొలిసారి. నాలుగో రోజు కేవలం విజయానికి 69 పరుగుల దూరంలో నిలిచిన సఫారీలు తమ రెండో ఇన్నింగ్స్‌లో 282/5 స్కోరు సాధించారు. మార్‌క్రమ్ (136), బవుమా (66) గెలుపులో కీలక పాత్ర పోషించారు. స్టార్క్‌కు మూడు వికెట్లు దక్కాయి. అంతకుముందు ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212, సౌతాఫ్రికా 138 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులు సాధించిన ఆసీస్ ప్రత్యర్థి ముందు 282 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. **ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్‌క్రమ్** నిలిచాడు.

తొలి సెషన్‌లోనే...: నాలుగో రోజు 213/2 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌతాఫ్రికా గెలుపునకు మరో 69 పరుగులే చేయాల్సివుంది. ఆసీస్ బౌలర్లు సఫారీలపై ఒత్తిడి పెంచేందుకు స్టంప్స్‌ను లక్ష్యంగా చేసుకుని బంతులు విసిరారు. వికెట్ల కోసం ఆసీస్ తమకున్న మూడు రివ్యూలను కూడా వాడేసుకుంది. కొత్త బంతిని సైతం తీసుకున్నా.. మొక్కవోని ఏకాగ్రతతో బ్యాటర్లు క్రీజులో నిలిచారు. తొలి సెషన్‌లో కేవలం మూడు బౌండరీలు మాత్రమే వచ్చాయి. అయితే మూడో ఓవర్‌లోనే కెప్టెన్ బవుమాను కమిన్స్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కానీ మార్‌క్రమ్ వారికి అడ్డుగా నిలిచాడు. స్టబ్స్ (8)తో కలిసి నాలుగో వికెట్‌కు 24.. బెడింగమ్ (21 నాటౌట్)తో కలిసి ఐదో వికెట్‌కు 35 పరుగులు జోడించాడు. గెలుపునకు మరో 6 పరుగుల దూరంలో అతడి 6 గంటల 23 నిమిషాల సుదీర్ఘ పోరాటానికి పేసర్ హాజెల్‌వుడ్ తెరదించాడు. మార్‌క్రమ్‌కు ఇరు జట్ల ఆటగాళ్లతో పాటు లార్డ్స్ ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో అభినందనలు తెలిపారు. చివరకు 84వ ఓవర్‌లో స్టార్క్ వైడ్ ఫుల్‌టాస్‌ను కవర్ పాయింట్ వైపు వెరెయిన్ (4 నాటౌట్) సింగిల్ తీయడంతో దక్షిణాఫ్రికా అంతులేని సంబరాల్లో మునిగింది.

4 ఐసీసీ టోర్నమెంట్ ఫైనల్స్‌లో ఆసీస్ ఓడడం ఇది నాలుగోసారి.



మార్‌క్రమ్

సరికొత్త అధ్యాయం

ఎన్నాళ్ల నిరీక్షణ.. ఎన్నేళ్ల నిర్వేదన..! కీలక నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓటములతో అభిమానుల కలలు కల్లలు కావడం.. జట్టు నైరాశ్యంలో మునిగిపోవడం. మొత్తంగా వెరసి 'అన్ లక్కీ' అనే ట్యాగ్‌ను సొంతం చేసుకొన్న జట్టు దక్షిణాఫ్రికా. చోకర్స్ (కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడికి చిత్తయ్యే జట్టు)గా ముద్ర వేసుకొన్న సఫారీలు ఇప్పుడు చాంపియన్లుగా నిలిచారు.

దిగ్గజాల వల్ల కానిది..: ఏబీ డివిల్లీర్స్, గ్రేమ్ స్మిత్, గ్యారీ కిర్‌స్టెన్, అలెన్ డొనాల్డ్, జాక్ కలిస్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు జట్టు కోసం ఎంతో శ్రమించారు. వీరందరి కృషితో జట్టు మెరుగుపడినా.. ఐసీసీ ట్రోఫీ మాత్రం అందని ద్రాక్షే అయింది. ఎట్టకేలకు మార్‌క్రమ్, బవుమా అద్భుత పోరాటంతో సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు.

ఓటములను దిగమింగుకొని..: నాకౌట్స్‌లో నిరాశ.. సఫారీలకు 1992 నుంచి వెంటాడుతోంది. ఆ వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్‌లో వరుణుడి రూపంలో షాక్ తగిలింది. 1999 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియాతో సెమీస్ మ్యాచ్ టై కావడం అనేది ఎప్పటికీ గుండెల్లో ముల్లులాంటిదే. గతేడాది జూన్ 29న జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన దక్షిణాఫ్రికా.. ఏడాది తిరిగే సరికి 'జూన్ 14'ను సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజుగా మార్చుకొంది. కెరీర్ చివర్లో ఉన్న రబాడ.. ఫైనల్ మ్యాచ్‌లో కంగారూల పనిబట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన మార్‌క్రమ్.. భారీ శతకంతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వీరిద్దరి పోరాట స్ఫూర్తితో సౌతాఫ్రికా అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఆలయాలకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీ

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం డిపో నుంచి ఆలయాలకు ఈ నెల 27న ఆర్టీసీ టూర్ ప్యాకేజీ అందుబాటులో ఉందని డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈనెల27న ఖమ్మం నుంచి డీలక్స్ బస్సు(సర్వీస్ నెంబరు 88666) ఉదయం బయలు దేరి అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం దర్శనం ఉంటుందన్నారు. అనంతరం 28న ఉదయం భద్రాచలం చేరుకోని భద్రాచల సీతారాములు దర్శనం, కిన్నెరసాని ప్రాజెక్టు చూపించి రాత్రికి ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. ఈ బస్సుకు అడ్వాన్స్ రిర్వేషన్ సదుపాయం అందుబాటులో ఉందని, చార్జీ రూ.1280గా నిర్ణయించినట్లు డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు.

వాగు పూడికకు మోక్షం

ఖమ్మంరూరల్, జూన్14(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం చెరువు నుంచి పెద్దతండా, గుర్రాలపాడు గ్రామాలకు సంబందించి పంట పొలాలకు వాగు ద్వారా నీరు ప్రవహిస్తుంది. ఈవాగు సుమారు 30 అడుగుల వెడల్పుతో ఉంటుంది. ఈ వాగును దానికి అనుకుని ఉన్న రైతులు, రియల్ వ్యాపారులు కొంత వాగును ఆక్రమించుకున్నారు. కొన్నేండ్లుగా పూడిక తీత పనులు చేసిన ధాఖలాలు లేవు. ఫలితంగా వర్షాల వచ్చి చెరువు నిండిన సమయంలో వాగు పొంగి సమీప ఇళ్లలోకి నీరు చేరుతుంది. నాలుగేండ్లుగా వాగు పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో వచ్చిన వర్షాలకు ఈవాగు పెద్దఎత్తున పొంగింది. ఆప్రాంతలోని శ్రీరాంనగర్, ఆదిత్యనగర్, చైతన్య నగర్, సాయిప్రభాత్‌నగర్, పెద్దతండా తదిత కాలనీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇది గమనించిన ఏదులాపురం



పూడిక తీయిస్తున్న దృశ్యం

మునిసిపాలిటీ అధికారులు జేసీబీతో ప్రస్తుతం వాగులో పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. గత ఏడాది వర్షాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ ఏడాది ముందస్తుగా వాగుపూడికతీత పనులు చేయిస్తున్నారు. నాళాలను శుభ్రం చేయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసేవలో బీజేపీ ముందంజ

జిల్లా అధ్యక్షుడు నెల్లూరి

నేలకొండపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవలో బీజేపీ ముందంజలో ఉందని, ప్రభుత్వం తీసుకుంటున్న కీలకనిర్ణయాలు వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం వేగంగా ముందుకు సాగుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తెలిపారు. శనివారం నేలకొండపల్లిలో వికసిత్ భారత్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మోడీ దేవాభివృద్ధికి తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయని పేర్కొన్నారు. పారదర్శకత, ప్రజల ఆర్థిక స్థిరత్వం, దేశభద్రత, వృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. మేక్ ఇండియ, సిల్క్ ఇండి పథకాలు విజయవంతంగా అమలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాలేరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ నున్నా రవికుమార్, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మండడపు సుధాకర్ పాల్గొన్నారు.

గుట్టుగా నిధుల మళ్లింపు

- కేఎంసీ ఖజానా నుంచి ఇతరశాఖలకు..
- దారితప్పుతున్న ఆర్థిక క్రమశిక్షణ
- వైద్య వాహనాల బిల్లుల చెల్లింపు ఒత్తిడితో బయటపడిన వైనం



ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్14 (ఆంధ్ర జ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ నిధులను ఇతర శాఖలకు మళ్లింపు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. జిల్లా ఉన్నత స్థాయి అధికారులే పరిపాలనలో చిన్న చిన్న సవరణలు చూసి ఏకంగా సంబంధం లేని ప్రభుత్వశాఖలకు మళ్లింపు చేస్తున్నారు. ప్రభుత్వ హాస్పటల్‌లో వాహనాల బిల్లులను కూడా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో చెల్లింపులకు పంపటం పాలకవర్గానికి విస్మయానికి గురి చేసింది. అయితే ఇదే విషయంపై చర్చలు జరగటంతో ఆయా బిల్లులను ప్రస్తుతానికి కేఎంసీ కమిషనర్ నిలుపుదల చేశారు.

లక్షణంగా పైకం

ఖమ్మం నగర పాలక సంస్థలో అత్యవసరంగా చిన్న,చిన్నఆర్థిక అవసరాలపై నేరుగా అధికారులే నిర్ణయాలు తీసుకునేందుకు పాలకవర్గం అనుమతి ఇచ్చింది. దీంతో రూ.1లక్ష లోపు లావాదేవీలను జిల్లా ఉన్నత స్థాయిలోని అధికారులు నిర్ణయం తీసుకునే వెసులుబాటు కలిగింది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు ఖమ్మం నగర పాలక సంస్థతో సంబందం లేని ఇతర ప్రభుత్వశాఖలు కొన్ని నెలలుగా సద్వినియోగం చేసుకుంటున్నాయి. కొన్ని ప్రభుత్వశాఖలు, విభాగాల అధికారులు జిల్లా ఉన్నతాధికారితో సిఫారసు చేయించుకొని బిల్లులు చెల్లింపులు జరుపుతున్నారు.

వెలుగులోకి ఇలా

అయితే ఇటీవల జిల్లా హాస్పటల్‌లోని వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే హబ్‌లో రవాణా చేసే వాహనాలకు బిల్లులు ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి చేపట్టాలని ఉన్నతాధికారి సిఫారసు చేశారు. ఈ ఫైలు కేఎంసీకి వచ్చింది. సాంకేతిక అంశాలను దృష్టిలో పెట్టుకొని ఫైల్‌ను అధికారులు నిలుపుదల చేశారు. సదరు వ్యక్తులు మాత్రం కేఎంసీ అధికారులపై వత్తిడి పెంచారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. కరోనా సమయంలో ఖమ్మం నగరంలో కరోనా పరీక్షలు చేసేందుకు అప్పటి అత్యవసర పరిస్థితి నేపథ్యంలో అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అదే అదునుగా వైద్యశాఖ అధికారులు సాధారణ సమయంలోను కేఎంసీ నుంచి వాహనాల బిల్లులు ఇవ్వాలని వత్తిడి పెంచుతున్నారు.

విచారణ చేయిస్తాం

పునుకొల్లు నీరజ: మేయర్

కొంతకాలంగా రూ.1 లక్షలోపు బిల్లులు ఇతర శాఖలకు బిల్లులు చెల్లిస్తున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది. ఈవిషయంపై పూర్తిస్థాయిలో తెలుసుకొని విచారణ చేస్తాం.నగర పాలక సంస్థ నిధులు ప్రజల అభివృద్ధి, కేఎంసీ కార్యాలయం నిర్వాహణకే వినియోగిస్తాం.

విపత్తుల్లో దివ్యాంగులు రక్షణ పొందాలి

శిక్షణ ఇచ్చిన ఎన్డీఆర్ఎఫ్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 14(ఆంధ్ర జ్యోతి): ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు జరిగిన సమయంలో కొద్దిపాటి జాగ్రత్తలతో దివ్యాంగులు రక్షణ పొందుతూ కుటుంబ సభ్యులను ఇతరులను కూడా రక్షించేందుకు అవకాశం ఉంటుందని ఎన్డీఆర్ఎఫ్ కమాండర్ గౌతమ్ సూచించారు. మెప్మా ఆధ్వర్యంలో ఖమ్మం రోటరీనగర్‌లో దివ్యాంగులకు విపత్తుల సమయంలో రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగులు వరదలు, ఇతర విపత్తుల సమయంలో ఏలా వాటి నుంచి రక్షణ పొందాలనే అంశాలను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వివరించారు. అంతేకాక వీటిపై ప్రదర్శనలు చేసి చూపించారు. వారి వారి అనుమానాలు నవృత్తి చేశారు. మెప్మా డీఎంసీ సావల సుజాత, దివ్యాంగుల సంక్షేమ వసతి గృహం నిర్వాహకులు రాధిక, రిసోర్స్ పర్సన్ బాణోత్ సోని పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్,మెప్మా అధికారులు

బస్సు, లారీ ఢీ: 11మందికి గాయాలు

- ఖమ్మం ఇల్లెందు ప్రధాన రహదారి తాళ్లగూడెం సమీపంలో ఘటన

కామేపల్లి,జూన్14(ఆంధ్రజ్యోతి): బస్సు ట్యాంకర్‌లారీ ఢీకొన్న సంఘటనలో డ్రైవర్, కండక్టర్‌తో సహా 11మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన ఖమ్మం ఇల్లెందు ప్రధాన రహదారి తాళ్లగూడెం జీవీటీఎల్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి కొత్త బస్టాండ్ నుంచి వెళుతున్న బస్సు తాళ్లగూడెం జీవీటీఎల్ సమీపంలో ఇల్లెందు నుంచి యాష్‌లోడ్‌తో వస్తున్న ట్యాంకర్ లారీ ఢీ కొట్టింది. బస్‌లో ప్రయాణిస్తున్న బస్ డ్రైవర్, కండక్టర్‌తో సహ 11మందికి గాయాలు అయ్యాయి. లారీ డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కొని పోవడంతో క్యాబిన్‌కు తాళ్లు కట్టి ట్రాక్టర్‌తో లాగి డ్రైవర్‌ను స్థానికులు కాపాడారు. తీవ్రగాయాలు కావడంతో వారిని 108 సహయంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. కామేపల్లి ఎస్ఐ సాయికుమార్ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనపై బస్ డ్రైవర్ పృథ్వీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



లారీ, బస్ ప్రమాద దృశ్యం

చైన్‌స్నాచర్ల అరెస్టు

- ప్రియుడితో కలిసి దొంగతనం
- జల్సాల కోసం వృద్ధురాలి మంగళసూత్రం చోరీ
- ఇద్దరిని అరెస్టు చేసిన వర్ధన్నపేట పోలీసులు

వర్ధన్నపేట,జూన్14(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో ఈనెల 11న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును దొంగిలించిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ తరలిస్తున్నట్లు వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం వర్ధన్నపేట పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైన్‌స్నాచర్స్‌ను అరెస్టు చూపించి నిందితుల వివరాలు వెల్లడించారు. వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన అమ్మమ్మగారి ఇంటికి ఖమ్మం నగరానికి చెందిన రామాయణం హేమలత పదిరోజుల కిందట వచ్చింది. తాగుడు, జల్సాలకు అలవాటు పడిన హేమలత.. అమ్మమ్మను డబ్బులు కావాలని అడుగగా లేవని చెప్పింది. దీంతో ఇంటికి ఎదురుగా ఉన్న పెరంబుదూర్ సుజాత అనే వృద్ధురాలి మెడలో ఉన్న బంగారంపై కన్నేసింది. ఆమె ఒంటరిగా ఉండడం గమనించింది. ఈ విషయాన్ని ఖమ్మానికి చెందిన తన ప్రియుడు పిడియాల రాముకు చెప్పింది. పథకం ప్రకారం ఈనెల11నగ్రామశివారులో ఉండమని చెప్పింది. వృద్ధురాలు రాత్రి సుమారు 10గంటలకు ఇంటి ముందు నిలబడి ఉండగా వృద్ధురాలితో మాట్లాడుతూ మెడను పట్టి, నోరుమూసి పుస్తెలతాడు లోక్కొని ప్రియుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పారిపోయారు. అనంతరం వృద్ధురాలు సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. కాగా, మంగళసూత్రం దొంగలించి పారిపోయిన హేమలత, రాములు ఖమ్మంలో రెండు రోజులు ఉండి తిరిగి వరంగల్‌లో విక్రయించడానికి ఈ నెల 14న ఉదయం వర్ధన్నపేట శివారు అల్‌ఫోర్స్ పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండడంతో వారు చూసి భయపడి పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకొని విచారించారు. మంగళసూత్రం దొంగిలించింది తామేనని వెల్లడించారు. దీంతో వారి వద్ద ఉన్న బంగారు మంగళసూత్రం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనపరుచుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ మేరుగు రాజు, కానిస్టేబుళ్లు సురేష్, రంజిత్, కల్పన, ఎమ్డీ.సానియా, ఫర్హాన్, స్వాతిలను సీఐ శ్రీనివాసరావు అభినందించారు.

బుల్లెట్ బైక్ అపహరణ

కామేపల్లి, జూన్14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పింజరమడుగు గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ కేళోత్ భాస్కర్ నాయక్ శుక్రవారం రాత్రి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. బుల్లెట్ బైక్‌ను పింజరమడుగు నెమలిపురి బీటీ రోడ్డు వద్ద ఉంచి పొలం దగ్గరకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బైక్‌లో లేకపోవడంతో భయాందోళనకు గురైయ్యాడు. బైక్‌లో రూ.1లక్ష60వేలు నగదు పెట్టానని, బైక్ నగదుతో సహ బైక్ ఎత్తుకెళ్లారని వాపోయాడు. వెంటనే కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

ఇజ్రాయిల్ దేశ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్14 (ఆంధ్ర జ్యోతి): ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రపంచ వ్యాప్తంగా ఖండించాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ యుద్ధ చర్యలను ఖండిస్తూ ర్యాలీ నిర్వహించి గట్టయ్య సెంటర్‌లో ఇజ్రాయిల్ దేశం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎర్రా శ్రీనివాసరావు, ఎస్కే మీరా, దొంగల తిరుపతిరావు, బోడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీనివాసరావు, నాగుల్‌మీరా, నర్రా రమేశ్, జె.వెంకన్నబాబు, భద్రం పాల్గొన్నారు.

మనం ఇచ్చే రక్తం.. మరొకరికి ప్రాణ దానం

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మనం ఇచ్చే రక్తం మరొకరికి ప్రాణం పోస్తుందని వీఆర్ విత్‌యూ ఆర్గనైజేషన్ ఫౌండర్ పేరం బోస్ యాదవ్ అన్నారు. శనివారం ప్రపంచ రక్తందినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలోని విదుర బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని ఆయన కోరారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం రక్తదానం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సుమారు 100 మంది పైగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో విదుర బ్లడ్ బ్యాంక్ బాధ్యులు సైదులు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జవాన్ నియామకంపై కేఎంసీలో చర్చ

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో ఏ రోజు ఏ ఉద్యోగి నూతనంగా బాధ్యతల్లో చేరుతారనే తెలియని పరిస్థితి కనబడుతుంది.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రెగ్యూలర్ ఉద్యోగులను నియామకం చేసుకుంటూ ఆ స్థానంలో ఉన్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇతర విభాగాలకు కేటాయిస్తోంది. కానీ ఖమ్మం నగర పాలక సంస్థలో నిత్యం నియామకాలు జరుగుతున్నాయని చర్చ జరుగుతుంది. శనివారం కూసుమంచి మండలం చేగొమ్మకు చెందిన తరుణ్ నేరుగా పారిశుద్య జవాన్‌కు 41వ డివిజన్‌కు వెళ్లారు. ఎటువంటి అనుభవం లేని వ్యక్తికి ఉద్యోగం ఇచ్చి డివిజన్‌కు పంపటంతో సదరు కార్పొరేటర్ నిరాకరించారు. తర్వాత పారిశుద్య అధికారులు 20వ డివిజన్‌కు జవాన్ బాధ్యతలు అప్పగించారు.అయితే ఇలా నేరుగా జవాన్ ఉద్యోగాలు ఇవ్వటంపై తోటి జవాన్లు, పారిశుధ్య కార్మికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జవాన్ నియామకం కేఎంసీలో చర్చనీయాంశంగా మారింది.

రేపు రైతులు రైతువేదికల వద్దకు రావాలి

ఖమ్మంరూరల్,జూన్14(ఆంధ్రజ్యోతి):ఈనెల16నముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని, రైతులందరు రైతువేదికల వద్దకు రావాలని రూరల్ వ్యవసాయాధికారి ఉమా నగేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పొన్నేకల్లు, ముత్తగూడెం, గోళ్లపాడు రైతువేదికలవద్దకు రైతులు మధ్యాహ్నం హాజరుకావాలని కోరారు.

సీపీఎం సభలను జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఖమ్మం నగరంలోని సుందరయ్య భవనంలో జరిగే సీపీఎం పాలేరు డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీపీఎం శ్రేణులు అధ్యయనం-ఆచరణ అనే నినాదంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు నంద్రా ప్రసాద్, పి.సంగయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం కమిటీ ఎన్నిక

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్14(ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగరంలోని 48వ డివిజన్ మున్నూరు కాపు సంఘం కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ సమక్షంలో జరిగిన ఎన్నికలో డివిజన్ అధ్యక్షుడుగా శాబాసు వెంకటరమణ, కార్యదర్శిగా ఆకుల సత్యనారాయణలను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోట రామారావు, రాకం శ్యాంబాబు, విప్ప వేణు, వెంకటనరసయ్య, ప్రభాకర్, రాధాకృష్ణ, రవికిషోర్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం, జూన్14(ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం మండలంలో పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బచ్చోడు, రాజారం, సోలిపురం, కాకరవాయి గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణ పనులకుశంకుస్థాపన చేస్తారని తెలిపారు. బచ్చోడు గ్రామంలో జైబాపు, జైభీమ్,జై సంవిధాన్ కార్యక్రమం పాల్గొంటారని తెలిపారు.

వాగ్దానాలను అమలు చేయాలి

తిరుమలాయపాలెం, జూన్14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. మండలంలోని హైదరసాయిపేటలో ఆపార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు సైద్ధాంతిక స్థాయి పెంచి చైతన్యపరిచేందుకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16,17,18తేదీల్లో పాలేరు డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో దాసరి మహేందర్,పుసులూరి వీరభద్రం, దాసరి భద్రయ్య, వెంకటేష్, లింగయ్య, పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఎం శిక్షణ తరగతులు

కూసుమంచి, జూన్14(ఆంధ్రజ్యోతి): సీపీఎం పాలేరు డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం నుంచి నిర్వహించనున్నట్లు మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్ తెలిపారు. మూడు రోజుల పాటు ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసమావేశంలో మండల కమిటీ సభ్యులు, గ్రామ శాఖాకార్యదర్శులు, ప్రతినిధులుగా హాజరుకావాలని కోరారు.

చేగువేరా బాటలో యువత పయనించాలి



ఖమ్మంసంక్షేమ విభాగం, జూన్ 14 (ఆంధ్ర జ్యోతి): చేగువేరా చూపిన ఉద్యమ బాటలో నేటి యువత పయనించాల్సిన అవసరం ఉందని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఆవుల అశోక్ అన్నారు. దేశంలో మైనార్టీలు, దళితులు, ఇతరవర్గాలపై దాడులు పెరుగుతున్నాయని వాటిని ఖండించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. చేగువేరా జయంతి సందర్భంగా శనివారం చేగువేరా వారియర్స్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీని ఆవుల అశోక్ ప్రారంభించారు. నామాల ఆజాద్, సురేశ్, గోలుసు వినయ్, లక్ష్మణ్, వెంకటేష్, భారత్, సాధిక్, యశ్వంత్,సందీప్,ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

వసతిగృహాల పరిసరాలు శుభ్రం



రహదారిని శుభ్రం చేస్తున్న దృశ్యం



గురుకుల వసతిగృహం చుట్టూ పిచ్చిమొక్కలు తొలగింపు, శుభ్రపడిన డ్రెయినేజీ

ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్14(ఆంధ్ర జ్యోతి): పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు ప్రారంభం కావటంతో ఖమ్మం నగరంలోని ఎస్సీఎస్టీ, బీసీ,మైనార్టీ సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యాలయాలు చుట్టూ ఖమ్మంనగర పాలక సంస్థలోని పారిశుధ్య పనులు చేపట్టారు.శనివారం ఎస్ఎస్‌పీ క్యాంపులోని ఎస్సీ కాంప్లెక్స్ వసతిగృహం చుట్టూ ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేశారు. ప్రధాన రహదారులను ఊడ్చి శుభ్రం చేశారు. వసతిగృహాలు, ఎస్సీ గురుకులం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విషసర్పాలు, విషపురుగులు తిరుగుతుండటంతో ఆయా పిచ్చి మొక్కలను శుభ్రం చేశారు.ఎస్సీవసతిగృహాల చుట్టూ పారిశుద్య పనులు చేపట్టటంతో అక్కడకు వచ్చిన విద్యార్థులతల్లి,దండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

నీట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల జయకేతనం



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్14(ఆంధ్రజ్యోతి): శనివారం ప్రకటించిన నీట్ ఫలితాల్లో నగరంలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ర్యాంకుల పరంపర కొనసాగించారని విద్యాసంస్థల చైర్మన్ వరదరెడ్డి తెలిపారు.కళాశాలకు చెందిన ప్రియాంక 100, సంతోష్ 1392, ఆకాష్ 1946, ఉమేష్ చంద్ర 2438, గాంధీ 4233 అత్యుత్తమ ర్యాంకుల సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సీఈవో సురేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి విద్యార్థులను అభినందించారు.

జూలై 19, 20వ తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

మధిర రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఖమ్మంజిల్లా 23వ మహాసభలు జూలై 19, 20వతేదీల్లో మధిరలో జరగనున్నాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేస్ అన్నారు. మహాసభల ఆహ్వానసంఘం సమవేశం శనివారం మధిరలో రిక్రియేషన్ క్లబ్‌లో సీపీఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఆహ్వానసంఘం సమావేశానికి సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేస్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద మౌలానాతోపాటు సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు కర్నాటి రాంమోహన్‌రావు తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ 23 వ మహాసభలు మధిరలో జరగనున్న నేపథ్యంలో ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.

రేపటి నుంచి మధిరలో మిర్చి కొనుగోళ్లు

మధిర రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మధిర మార్కెట్ యార్డులోఈనెల 16వతేదీన మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు తెలిపారు. శనివారం వ్యసాయమార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈఏడాది రబీ ధాన్యాన్ని ప్రభుత్వం తరఫున స్వయంసహాయక సంఘాల ద్వారా మూడు మండలాల్లో 1035 మంది రైతులవద్ద 51,207 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.12కోట్ల రైతుల ఖాతాల్లో జమ చేశామని అన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అయిలూరి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ పాల్గొన్నారు.

18న స్పోర్ట్స్ స్కూల్స్‌కు ఎంపికలు

ఏన్కూరు, జూన్14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ స్కూళ్ల ప్రవేశాలకు ఈనెల 18న జడ్పీహెచ్‌ఎస్ తిమ్మారావుపేటలో మండల స్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్టు ఎంఈవో రమీంటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్‌లలో 4వ తరగతి ప్రవేశాలకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు సోమవారం 15వ తేదీన మీ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ చేసుకుని దరఖాస్తులను ఎంఆర్‌పీ కార్యాలయంలో అందచేయాలని కోరారు.

అంతుచిక్కని వ్యాధితో గేదెల మృత్యువాత

ఏన్కూరు, జూన్14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచారం గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. గత కొన్ని రోజుల నుంచి గేదెలు చనిపోతున్నాయి. ఇప్పటి వరకు సుమారు 8 గేదెలు మృతి చెందాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన వీరభద్రం, వెంకటకృష్ణ, సుహాసిని, నజీర్‌లకు చెందిన గేదెలు మృత్యువాత పడ్డాయి. శనివారం సమాచారం తెలుసుకున్న పశు వైద్యాధికారి డాక్టర్ జి.సుబ్బారావు తనసిబ్బందితో కలిసి ఈ గ్రామానికి వెళ్లారు. చనిపోయిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు. శాంపిల్స్ సేకరించి హైదరాబాదు ల్యాబ్‌కు పంపిస్తున్నట్టు డాక్టర్ సుబ్బారావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టౌన్ ఏఈ యు శరత్‌బాబు శనివారం తెలిపారు. ఉదయం 8.30నుంచి 11.30వరకు జవహర్ నగర్, రాజీవ్‌రోడ్, న్యూ కొమ్మేపల్లి కాలనీ, ఆర్‌కే ఆస్పత్రి రోడ్, గుడిపాడు రోడ్డు, ప్రకాశం పంతులు వీధిలలో ఫీడర్ ట్రీ కటింగ్ కోసం అంతరాయం ఏర్పడనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్థల వివాదంపై ఎస్ఐ విచారణ

కారేపల్లి, జూన్14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో వివాద స్థలాన్ని శనివారం ఎస్ఐ బైరు గోపి విచారణ చేపట్టారు. గత కొంతకాలంగా ఇంటి స్థలంపై వివాదం జరుగుతుండటంతో పాటు ఇరువర్గలకు చెందినవారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. వారి ఫిర్యాదుల మేరకు ఎస్ఐ ఘటనస్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఇరువర్గాలకు సంబంధించిన వారిని పిలిపించి విచారణ చేశారు.

35 మంది విద్యార్థులకు ఉద్యోగాలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సత్తుపల్లి, జూన్14 (ఆంధ్రజ్యోతి): అపోలో ఫార్మసీ కంపెనీ శనివారం నిర్వహించిక క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో మండలంలోని కొత్తూరులోని మదరథెరిస్సా ఫార్మసీ కళాశాల విద్యార్థులు 35మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులు ఒకొక్కరికి నెలకు రూ.20వేల చొప్పున వేతనంతో ఎంపికై ఆఫర్ లెటర్లు పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ కంచర్ల సత్యనారాయణ, సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కుమార్‌రాజా జయవరపు అభినందించారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

సత్తుపల్లిరూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలో ని శ్రీ కోదండ రామాలయం 51వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష కైంకరోత్సవాలు నిర్వహించారు. వస్త్రాలంకరణ పుష్పాలంకరణం, సహస్రనామ సహిత పుష్పార్చన, ప్రసాద నివేదనం, కల్యాణోత్సవం పఠణం, పట్టాభిషేకోత్సవ మంత్ర పఠనం, నీరాజనోత్సవం సాగాయి. కార్యక్రమంలో భక్తులతో పాటు ట్రస్ట్ సభ్యులు, హనుమాన్ భక్తబృందం పాల్గొన్నారు.

ఆలయంలోకి దూసుకెళ్లిన లారీ

పెనుబల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంకపల్లి గ్రామంలో సత్తుపల్లి-ఖమ్మం జాతీయ రహదారిలో లారీ అదుపుతప్పి రామాలయంలోకి దూసుకెళ్లిన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సత్తుపల్లి వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ లంకపల్లి గ్రామంలో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఎదురుగా ఉన్న రామాలయంలోకి దూసుకెళ్లింది. దీంతో ఆలయం పూర్తిగా ధ్వంసమైంది.



మధిరలో రాజీపడిన వారికి అవార్డులు అందజేస్తున్న న్యాయాధికారి



సత్తుపల్లి లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి మారగాని శ్రీనివాస్

మెగా లోక్ అదాలత్ విజయవంతం

» 529 కేసుల పరిష్కారం

మధిర రూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): మధిర కోర్టులో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమం విజయవంతమైంది. ఈ లోక్‌అదాలత్‌లో 529 కేసులు పరిష్కారం అయ్యాయి. మధిరకోర్టులో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవా అధికార సంస్థ చైర్‌పర్సన్ ఎన్.ప్రశాంతి ఆధ్వర్యంలో జరిగినజాతీయ మెగా లోక్‌అదాలత్‌లో మధిర కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి దీప్తి అధ్యక్షతన జరిగిన బెంచ్‌లో కేసులు పరిష్కారమయ్యాయి. మధిర ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిపరిధిలో 289 కేసులు పరిష్కారం కాగా, రూ.1,32,900 జరిమాన విధించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి పరిధిలో 240 కేసులు పరిష్కారం కాగా రూ.3,86,800 జరిమాన విధించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి ముద్దాయిలకు విధించిన జరిమానాల్లో నుంచి కొంత మొత్తాన్ని బాధితులకు అందేలా ఏర్పాటుచేశారు. ఈవిషయమై బాధితులు, న్యాయవాదులు పోలీసులు హర్షం వ్యక్తంచేశారు ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ముఖ్యఅతిథిగా మధిర కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.ప్రశాంతి మాట్లాడుతూ కక్షిదారులు క్షణికావేశంలో చేసినటువంటి నేరాలలో పునరాలోచన చేసి రాజీపడడం వల్ల ఇరుపక్షాలు న్యాయం పొందినట్టు అవుతుందని అన్నారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల మాట్లాడుతూ బాధితులు, ముద్దాయిలు ఒక అవగాహనకు వచ్చి రాజీపడినట్లయితే అది రాజమార్గం అవుతుందన్నారు. ఈసందర్భంగా క్రిమినల్ కేసులలో విధించే జరిమానాల్లో కొంత మొత్తాన్ని బాధితులకు అందచేసే విధంగా అవార్డులు తయారుచేసి బాధితులకు అందచేయడం కొత్త వరవడిని సృష్టించింది. ఈసందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి చేతులమీదుగా అవార్డు కాపీలు అందించారు. కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ఎం.అబ్రహం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లారావు, ఏపీపీజే భద్రయ్య, సీఐ రమేష్ ఎస్ఐ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

రాజీతో డబ్బు, శ్రమ ఆదా అవుతాయి

» 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్

» లోక్ అదాలత్‌లో 491కేసుల పరిష్కారం

సత్తుపల్లి, జూన్14 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకుంటూ ఇరువర్గాలకు మానసిక ఒత్తిడి తగ్గి డబ్బు, శ్రమ, సమయం ఆదా అవుతాయని 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం సత్తుపల్లి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టులో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 491కేసులు పరిష్కారమయ్యాయి. అంతకముందు న్యాయాధికారులు మాట్లాడుతూ కేసులు పెంచుకుంటూ పోతే రోజుల తరబడి పరిష్కారం అవ్వకపోవడంతో పాటు ఒక్కరే గెలిచే అవకాశం ఉంటుందని, కానీ లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాలకు న్యాయం జరుగుతుందన్నారు. కక్షలు, కార్పణ్యాలు పెరిగి వందల వేలు కేసులు పెరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా చట్టాలపై కక్షిదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే. మీరా ఖాసీం సాహెబ్, జూనియర్ సివిల్ జడ్జి సుమబాల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపూల వెంకటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మంజుల

వైరా, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైరా శాంతినగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఎక్కిరాల వెంకటేశ్వర్లు కుటుంబానికి ఆపార్టీ జీవిత బీమా ప్రీమియం కింద మంజూరైన రూ.రెండులక్షల చెక్కును మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ సతీమణి మంజుల అందజేశారు. శనివారం మదన్‌లాల్ నివాసంలో సతీమణి మంజుల బాధిత కుటుంబానికి చెక్కు అందజేసి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ వైస్‌ఎంపీపీ తన్నీరు జ్యోతి, నాయకులు కొత్తా వెంకటేశ్వరరావు, అప్పం సురేష్, కిలారు కిరణ్, మేదరమెట్ల రాము, ఆదూరి ప్రేమ్‌కుమార్, నల్లబోలు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కార్తీక పుణ్య స్నానాలకు మెట్లు నిర్మించాలి

వైరా, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి గ్రామం వద్ద కుడికాల్వలో కార్తీక పుణ్యస్నానాల కోసం మెట్లు నిర్మించాలని నీటిపారుదలశాఖ ఏఈఈ వెంకట్రాములుకు తాటిపూడి, కొష్టాల గ్రామస్థులు శనివారం వినతిపత్రం అందజేశారు. కుడికాల్వ ఆధునీకరణ పనులు జరుగుతున్నందున ఏటా కార్తీకమాసంలో భక్తులు స్నానాలు ఆచరించటానికి సౌకర్యవంతంగా మెట్లు నిర్మించాలని మంచల జయరాజు, నాగరాజు, నిర్మల, ఆంజనేయులు, పుల్లయ్య కోరారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ కోసం కృషి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగారావు



రంగారావును సన్మానిస్తున్న మున్నూరుకాపు మహిళలు

వైరా, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు కార్పొరేషన్ కోసం పనిచేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు పేర్కొన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని 12వ వార్డు రేచర్ల బజార్‌లో శనివారం మున్నూరుకాపు కులసంఘం ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా రంగారావును సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మున్నూరుకాపు కులం నుంచి టీపీసీసీ కార్యవర్గంలో తనకు అవకాశం లభించిందని అందుకు సహకరించిన కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తన 35సంవత్సరాల రాజకీయ జీవితంలో ఏ హోదాలో పనిచేసినా మున్నూరుకాపులు తన రాజకీయ ఎదుగుదలలో ఎంతో సహకరించారని తెలిపారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, నాయకులు రేచర్ల నాగేశ్వరరావు, రాముడు, కట్ల సంతోష్, నాగరాజు, మహేష్, సీతరాములు పాల్గొన్నారు.

సమాజ సేవ చేయడం అభినందనీయం

» సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గోపాలరావు, ఏపీపీ ప్రదీప్



విద్యార్థులను అభినందిస్తున్న సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్

సత్తుపల్లిరూరల్, మే14 (ఆంధ్రజ్యోతి): బాధ్యతను గుర్తెరిగి తనవంతుగా వివిధ రకాల సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రాఫిట్ షూ కంపెనీ తీరు అభినందనీయమని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జే గోపాలరావు, ఏపీపీ జే ప్రదీప్ అన్నారు. సత్తుపల్లి వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన కొనకళ్ల ధనదుర్గ (కాకర్లపల్లి), పంతంగి లక్ష్మీప్రసన్న (రేజర్ల)లకు స్థానిక ప్రాఫిట్ షూ మార్ట్‌లో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రం, మెమోంటోతో పాటు షూ, కాలేజీ బ్యాగ్‌లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది నల్లగట్ల విజయకుమార్, ఉపాధ్యాయులతో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మోదీ విధానాలు: బాగం



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

మధిరరూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): దేశంలో మోదీ విధానాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని , మోదీ సంపన్నవర్గాల ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. శనివారం మధిరలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నారని సామాన్యమైన కోటీశ్వరులగా ఉన్న అదాని మోదీ 11 ఏళ్ల పాలనలో ప్రపంచ కోటీశ్వరులలోనే 10వ స్థానాన్నిఆక్రమించాడని తెలిపారు. రెతుల రుణాలను మాఫీచేయడానికి మోదీ మనస్కరించడం లేదు కానీ రూ.15లక్షల కోట్ల పారిశ్రామికవేత్తల సొమ్మును రద్దు చేసేందుకు వెనుకాడలేదన్నారు మోదీ విధానాలుపేద, మధ్యతరగతి ప్రజలకు శాపంగా మారాయన్నారు. ప్రజల ఆశలకు అనుగుణంగా పనిచేయకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. హామీల అమలుకు ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం పనిచేయాలన్నారు. వ్యవసాయరంగానికి మరింత సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆయన తెలిపారు. ప్రజాసమస్యలపై చర్చించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకునేందుకు మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, , రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సీపీఐ నాయకులు బెజవాడ రవి, మందరపు రాణి, ఓట్ల కొండలరావు, రహీం పాల్గొన్నారు.

బత్తుల స్ఫూర్తితో ఉద్యమించాలి

» సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నర్సయ్య

» సత్తుపల్లిలో 'బత్తుల జీవనరేఖలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

సత్తుపల్లిరూరల్, జూన్14 (ఆంధ్రజ్యోతి): నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమ పోరాట స్ఫూర్తితో దోపిడీ పీడన లేని సమాజం కోసం బత్తుల వెంకటేశ్వరరావు తన జీవితాన్ని త్యాగం చేశారని, ఆయన స్ఫూర్తితో ప్రజా శ్రేయస్సు కోసం మనమంతా ఉద్యమించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పిలుపునిచ్చారు. శనివారం సత్తుపల్లిలోని బత్తుల వెంకటేశ్వరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కళాభారతి ఆడిటోరియంలో 'బత్తుల జీవనరేఖలు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి గరిమెళ్ల నరసింహారావుకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బత్తుల అమరులైన 56సంవత్సరాల సందర్భంగా ప్రచురితమవ్వడం సంతోషంగా ఉందని, రచయితలు డాక్టర్ కే.ముత్యం, ఆర్.శివలింగంతో పాటు బీవీఎంటీ ట్రస్ట్ బాధ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో బత్తులను ఆనాటి పాలకులు పొట్టన పెట్టుకున్నారని, ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత పోరాడాలని ఆకాంక్షించారు. వర్ణ ధర్మం వలన దేశంలో నిచ్చెనమెట్ల సమాజం ఆవిర్భవించిందని విద్య పరిరక్షణ కమిటీ జాతీయ నాయకులు రమేష్ పట్నాయక్ అన్నారు. మనుధర్మం-మతోన్మాదం వల్ల స్వాతంత్రోద్య పోరాట ఫలితంగా రాజ్యాంగంలో సాధించుకున్న ప్రాథమిక హక్కులపై దాడి జరుగుతుందన్నారు. కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ఇతర అన్నివర్గాల ప్రజలు తమ హక్కులను కోల్పోతారని పేర్కొన్నారు.

మధ్య యుగాల్లో కూడా అన్నిమతాల ప్రజలు సామరస్యంగా కలిసిమెలిసి జీవించారని గుర్తుచేశారు. ఆనాడు మత ఘర్షణలు జరగలేదని, రాజ్య విస్తరణ కోసమే ఆనాడు యుద్ధాలు జరిగాయే తప్ప మతవ్యాప్తి కోసం జరగలేదని, భక్తి ఉద్యమం కూడా వ్యాప్తి చెందిందన్నారు. కార్యక్రమంలో బీవీఎంటీ అధ్యక్ష,కార్యదర్శులు కొండపల్లి విజయకుమార్, కూకలకుంట రవి, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, మాస్‌లైన్ బాధ్యులు అమర్లపూడి రాము, నూప భాస్కర్, ఏ.వెంకన్న, గంటా శ్రీను, లాజర్, గోకినేపల్లి లలిత, అమర్లపూడి శరత్, కాటినేని శ్రీను, ట్రస్ట్ సభ్యులు ఎన్‌సీహెచ్ వరదాచార్యులు, ఏ లింగారావు, ఎస్‌కే బురాన్, ఎంఎస్ఎన్, కొత్తా శ్రీను, పిల్లా మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల మెడలు వంచాలి: నున్నా

తల్లాడ, జూన్14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక హామీలు అమలుచేయకుండా మోసంచేసిన పాలకుల మెడలు వంచేలా ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని కుర్నవల్లి గ్రామంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం సత్తుపల్లి డివిజన్ స్థాయిరాజకీయ శిక్షణ తరగతులలో ఆయన మాట్లాడారు. ప్రజలను కష్టాలనుంచి విముక్తి కలిగించేది మార్క్సిజం మాత్రమేనన్నారు. కమ్యూనిస్టు కార్యకర్తలు నీళ్లలో చేపలా ప్రజలతో కలిసి ఉండి వారిసమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలన్నారు. తరగతులకు సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా, మాచర్ల భారతి, రమేష్, విఠల్, పాండురంగారావు పాల్గొన్నారు.

మేడారంలో రోడ్డు ప్రమాదం

18 మంది చిరునోముల వాసులకు గాయాలు

వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం



గాయాలపాలైన బాధితులు

బోనకల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మేడారం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోనకల్ మండలం చిరునోముల గ్రామానికి చెందిన 18 మంది కూలీలు గాయపడ్డారు. ఇందులో నలుగురికి తీవ్ర గాయాలు కాగా మరో 14 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన 36మంది కూలీలు మామిడితోటల్లో కాయలు కోసే పనులకు వెళ్తుంటారు. పనులన్ని పూర్తి కావడంతో వారంతా మేడారంలోని సమ్మక్క, సారలమ్మ వద్దకు మొక్కులు చెల్లించుకునేందుకు రెండు ఆటోలను మాట్లాడుకుని మేడారం వెళ్లారు. అమ్మవారి వద్ద మొక్కులు చెల్లించుకొని ఎంతో ఆనందంగా గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మేడారం సమీపంలో ఉన్న మూల మలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న ఒక వాహనానికి వీల్ బేరింగ్ పగిలి పోవడంతో ప్రమాద వశాత్తు పల్టీ కొట్టింది. ఇందులో ప్రయాణిస్తున్న తెల్లబోయిన బుజ్జి, పోతనబోయిన బాను, బల్లి యశ్వంత్, భార్గవ్ తీవ్రంగా గాయపడ్డారు. మరో 14 మందికి గాయాలతో బయటపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ నలుగురిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది.